చిరు నిరసన



పొగాకు ఉత్పత్తుల విక్రయాలకూ ప్రత్యేకంగా అనుమతి పత్రాలు అవసరమంటూ ప్రభుత్వం నిబంధన విధించడం సరికాదని చిల్లర వ్యాపారులు ఉద్యమించారు. సర్కారు నిబంధనలను వ్యతిరేకిస్తూ బెంగళూరు ఫ్రీడం పార్కులో మంగళవారం గళం విప్పి.. పిడికిలి బిగించిన వ్యాపారులు వీరంతా. **(న్యూస్‌టుడే, బెంగళూరు)**



దాడులు దారుణం : లెబనాన్‌పై ఇజ్రాయెల్ దళాల దాడులు మానవ హక్కుల హననంగానే భావించాలని, ఇలాంటి యుద్ధోన్మాదం ప్రపంచ ప్రశాంతతకే ముప్పని ఎస్‌యూసీఐ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. తక్షణమే ప్రపంచ దేశాలు స్పందించి శాంతికి దోహదపడాలని పార్టీ కార్యకర్తలు బెంగళూరు ఫ్రీడం పార్కులో నిరసన ప్రదర్శన చేపట్టారు. **(న్యూస్‌టుడే, బెంగళూరు)**



కార్యక్రమాన్ని వీక్షించేందుకు వచ్చిన ప్రేక్షకులు



తన బృందంతో కలిసి ప్రదర్శనలో పాల్గొన్న కళాకారుడు రవి బస్రూరు

దసరా వేళ.. యువ నగారా

మైసూరు, న్యూస్‌టుడే : విఖ్యాత దసరా వేడుకలను వీక్షించేందుకు దేశ, విదేశాల పర్యాటకులు కదలివచ్చిన వేళ రాచనగరి కిటకిటలాడుతోంది. సాయంత్రం నుంచి ప్రధాన వీధుల్లో వాహనరద్దీ కొనసాగుతోంది. అంబావిలాస్ ప్యాలెస్‌లో రాజ వంశస్థుడు కృష్ణదత్త ఒడెయారు ప్రైవేటు దర్బారు నిర్వహించారు. యువ దసరాలో భాగంగా సంగీత దర్శకుడు రవి బస్రూరు, కళాకారులతో ఇచ్చిన ప్రదర్శన, కచేరీలు యువతను ఆకట్టుకున్నాయి. దక్ష యజ్ఞం యక్షగాన నాటకం, నృత్య ప్రదర్శనలు వేర్వేరు వేదికలపై కొనసాగాయి. 'కన్నడ సినిమా కొనసాగిన మార్గం' పేరిట మాల్ ఆఫ్ మైసూరు చిత్రమందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను చిత్రదర్శకుడు నాగతిహళ్లి చంద్రశేఖర్ ప్రారంభించారు. ఫల, పుష్ప ప్రదర్శనకు చక్కని స్పందన లభిస్తోంది. ప్రభుత్వ పంచ గ్యారంటీ పథకాలను తెలిపే బొమ్మలను పుష్పాలతో అలంకరించారు. నాల్వడి కృష్ణరాజ ఒడెయరు కాలంలో నిర్మించిన భద్రావతి పరిశ్రమ, శివసముద్ర విద్యుత్తు ఉత్పాదన కేంద్రం, మైసూరు విశ్వవిద్యాలయం, ఆకాశవాణితో పాటు మలెమహదేశ్వరుని బెట్టపై ఏర్పాటు చేసిన మాదప్ప విగ్రహం నమూనాను ఉద్యానవనంలో ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. జంబూ సవారీ నిర్వహించే శనివారం ప్రత్యేక ప్రదర్శన ఇచ్చేందుకు కుస్తీ పహిల్వాన్ శ్రీనివాస్ జట్టి సన్నాహాలు చేసుకుంటున్నారు. ప్యాలెస్ ఆవరణలో రాజవంశస్థుల ముందు వీరు తమ విద్యను ప్రదర్శించనున్నారు. చామరాజనగర దొడ్డగరడిలో తర్ఫీదుదారుడు పుట్టణ్ణ జట్టి ఆయనకు శిక్షణ ఇస్తున్నారు. కొనుగోలుదారులు, పర్యాటకులతో అన్ని పర్యాటక ప్రాంతాల వద్ద రాత్రుళ్లు రద్దీ నెలకొంటోంది. ఇప్పటికే అన్ని హోటళ్లు, రిసార్టుల్లో గదులన్నీ బుక్ అయ్యాయి. మైసూరు నుంచి చుట్టుపక్కల ప్రాంతాలు, పర్యాటక కేంద్రాలకు వెళ్లివచ్చేందుకు పర్యాటక శాఖ, ప్రైవేటు ట్రావెల్స్ ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకువచ్చాయి.



జోరుగా.. హుషారుగా.. మైసూరు కుస్తీ పోటీలు



మైసూరు దసరా సంబరాల్లో రక్షక దళాల విన్యాసాల ముందస్తు కసరత్తు.. ఆకట్టుకునే రీతులెన్నెన్నో

నీరస ఫలితాలతో తత్తరపాటు

కాంగ్రెస్‌లో అంతర్మథనం

ఈనాడు, బెంగళూరు : హరియాణా, జమ్ము కశ్మీరు శాసనసభ ఎన్నికల ఫలితాలు వెల్లడైన వెంటనే కన్నడనాట కాంగ్రెస్ శ్రేణుల్లో అంతర్మథనం ప్రారంభమైంది. ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్రంలోని రెండు జాతీయ పార్టీల్లో అంతర్గత చర్చలు, వ్యూహాల తయారీకి అవకాశం కల్పించాయి. ఈ రెండు రాష్ట్రాల్లో ఎన్నికలు భాజపా, కాంగ్రెస్‌లకు మిశ్రమ ఫలితం అందించినా భాజపాతో పోలిస్తే కాంగ్రెస్‌కు కాస్త అసంతృప్తినే మిగిల్చాయి. ఇవి.. రానున్న మహారాష్ట్ర ఎన్నికలపై ప్రభావం చూపుతాయనే అంచనా వేస్తున్నారు. కర్ణాటకతో సరిహద్దు పంచుకునే మహారాష్ట్ర ఎన్నికలు ఇక్కడి రాజకీయ వాతావరణంతో ప్రభావితం అవుతాయన్న వాదన కొట్టిపారేయలేనిది. రాష్ట్రంలో ప్రధాన ప్రత్యర్థులైన భాజపా, కాంగ్రెస్‌లు హరియాణాతో పాటు మహారాష్ట్రలోనూ పోటీ పడుతుంటాయి. ఇక్కడి రాజకీయ వైరం ఇతర రాష్ట్రాలపైనా పడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తుంటారు.

హరియాణాలో ప్రతిధ్వనులు: ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై 'ముడా' కేసు ఉచ్చు బిగిస్తున్న సమయంలోనే హరియాణా, జమ్ము కశ్మీరులో ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఆ ప్రచారంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారును గట్టిగా విమర్శించారు. దళితులు, వెనుకబడిన వర్గాల పార్టీగా ప్రచారం చేసుకునే కాంగ్రెస్- కర్ణాటకలో అందుకు భిన్నంగా వ్యవహరించిందని మోదీ ఆరోపించారు. ఈ ప్రచారంలో ముఖ్యంగా వాల్మీకి ఎస్టీ అభివృద్ధి కార్పొరేషన్ అక్రమాలను ఆయన ప్రస్తావించారు. ఎస్టీలకు దక్కాల్సిన నిధులను పొరుగు రాష్ట్రంలో పార్టీ నేతలకు మళ్లించినట్లు ప్రధాని ఆరోపించారు. ఇదే సందర్భంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుటుంబ సభ్యులు దళితులకు దక్కాల్సిన భూములను ముడా అండదండలతో అక్రమంగా పొందారని ఆరోపించారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కేవలం ఏడాదిలోనే రూ.5 వేల కోట్ల ముడా అక్రమాలు, రూ.100 కోట్ల వాల్మీకి ఎస్టీ మండలి అక్రమాలకు పాల్పడినట్లు ఆయన పదేపదే ప్రచారంలో ప్రస్తావించారు. ఈ విషయాన్ని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత కె.బి.కోళివాడ్ గుర్తు చేశారు. హరియాణాలో కాంగ్రెస్ ఓడేందుకు ఇక్కడి ముడా అక్రమాలే కారణమన్నారు. తాను ముఖ్యమంత్రిని రాజీనామా చేయాలని సూచించిననాడే ఆ పని చేసి ఉంటే హరియాణాలో ఫలితం భిన్నంగా ఉండేదన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యల బలం ఎంతుందో అంచనా వేయకున్నా ప్రధాని నరేంద్ర మోదీ కర్ణాటక ముడా అక్రమాలపై ఎక్కువగా దృష్టి సారించటం అక్కడి ఫలితాన్ని ప్రభావితం చేసిందన్న వాదన వినిపిస్తోంది. భాజపా, కాంగ్రెస్ ఆధిపత్యానికి కేవలం 12 స్థానాలే వ్యత్యాసం ఉండటంతో ముడా ప్రభావం ఎక్కువగా చర్చకు వస్తోంది. జమ్ము కశ్మీరులోనూ కాంగ్రెస్ ఒంటరిగా ఆరు స్థానాల్లో మాత్రమే గెలవగా, ఎన్‌సీతో పొత్తు వల్ల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం ఊరట కల్గించే అంశం.

కుల సమీక్షతోనూ..: రాష్ట్ర సర్కారు చేపట్టే కుల సమీక్ష, గ్యారంటీ పథకాలు జాతీయ స్థాయిలో ప్రభావితం కానున్నాయనేందుకు హరియాణా ఫలితం సాక్ష్యంగా నిలుస్తోంది. అక్కడ జాట్‌లు, ముస్లింల ప్రభావం ఎక్కువగా ఉండటంతో ఈ సముదాయాల వారు భాజపాను వ్యతిరేకిస్తున్నారు. ఈ వ్యతిరేకతను కాంగ్రెస్ ఓట్లుగా రాబట్టుకోలేదన్న వాదన వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో చేపట్టిన కుల సమీక్షను ప్రచారంలో అస్త్రంగా మార్చుకుంది. జాట్‌లు, ముస్లింలు, దళితులను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ కర్ణాటకలోని సామాజిక, ఆర్థిక సమీక్షను చేపడతామని ప్రచారం చేసింది. ఈ ప్రచారం లబ్ధి చేకూర్చలేదని తాజా ఫలితం రుజువు చేసింది. ఈ మూడు సముదాయాలు మినహాయించి.. ఓట్లను భాజపా రాబట్టుకుని విజయం సాధించింది. కర్ణాటకలో 2023 ఎన్నికల మాదిరిగానే హరియాణాలోనూ ముఖ్యమంత్రి అభ్యర్థిని గుర్తించని కాంగ్రెస్ ఇక్కడి మాదిరి ఫలితాన్ని రాబట్టుకోలేకపోయింది. కర్ణాటక మాదిరి గ్యారంటీలను ఈ రెండు రాష్ట్రాల ప్రచారంలో అస్త్రంగా మార్చుకున్నా కాంగ్రెస్‌కు పెద్దగా లాభించేది లేదు.



విజయహాసం : హరియాణాలో భాజపా మూడోసారి విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం మిన్నంటింది. బెంగళూరు మల్లేశ్వరంలోని భాజపా కార్యాలయం వద్ద పార్టీ రాష్ట్రాధ్యక్షుడు బి.వై.విజయేంద్ర, మాజీ మంత్రి సీటీ రవి తదితరులు మిఠాయిలు పంచిపెడుతున్న దృశ్యం. **(న్యూస్‌టుడే, బెంగళూరు)**

మార్పు కోరుకున్నారు

భాజపా నుంచి దేశం విముక్తి కోరుకుంటున్నట్లు ఈ ఫలితాలు స్పష్టం చేశాయని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. మంత్రులు డాక్టర్ జి.పరమేశ్వర్, రామలింగారెడ్డి, కృష్ణబైరేగౌడ తదితరులు స్పందిస్తూ.. హరియాణాలో గట్టిపోటీ, జమ్ము కశ్మీరులో అధికారాన్ని ఏర్పాటు చేయబోతున్నామన్నారు. మరోవైపు భాజపా శ్రేణులు ఈ ఫలితాలతో ఉత్సాహంతో ఉన్నాయి. జగన్నాథ భవన్ వద్ద పార్టీ కార్యకర్తలు, నేతలు సంబరాల్లో మునిగి తేలారు. కాంగ్రెస్ గ్యారంటీలు జాతీయ స్థాయిలో ప్రభావం చూపవని రాష్ట్ర అధ్యక్షులు బి.వై.విజయేంద్ర, ఆర్.అశోక్ వ్యాఖ్యానించారు.

దర్శన్‌కు దక్కని ఊరట



బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో నిందితులు- కథానాయకుడు దర్శన్, నాయకి పవిత్రాగౌడ బెయిలు కోసం వేసుకున్న అర్జీ విచారణ బుధవారానికి వాయిదా పడింది. నిందితులకు బెయిలు ఇవ్వకూడదంటూ ప్రభుత్వ న్యాయవాది ప్రసన్నకుమార్ సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. ఫిబ్రవరి నుంచే రేణుకాస్వామి తనకు సందేశాలు పంపిస్తూ ఉంటే.. దానిపై పోలీసులకు ఫిర్యాదు చేయకుండా పవిత్రాగౌడ తన వాట్సప్ నంబరు ఇచ్చిందన్నారు. అనంతరమే అతను అశ్లీల చిత్రాలను పంపించాడని తెలిపారు. నంబరు బ్లాక్ చేసుకునేందుకు లేదా.. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉన్నప్పటికీ దాన్ని వినియోగించుకోలేదన్నారు. బెంగళూరుకు పిలిపించి హత్య చేయడం దారుణమని ప్రసన్నకుమార్ వాదించారు. రేణుకాస్వామి ఛాతీపై కొట్టడంతోనే ఎముకలు విరిగి చనిపోయాడని ఫోరెన్సిక్ ప్రయోగశాల నివేదికను న్యాయమూర్తి దృష్టికి ఆయన తీసుకువెళ్లారు.

సర్కారును కూల్చేందుకు కుట్ర

బెంగళూరు (శివాజీనగర): ప్రభుత్వాన్ని కూలగొట్టేందుకు భాజపా నాయకులు రూ.వెయ్యి కోట్లు కూడగట్టారని మంత్రి శివరాజ్ తంగడగి ఆరోపించారు. భాజపా ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ చేసిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర, హావేరి ఎంపీ బసవరాజ బొమ్మై నివాసాల్లో సోదాలు చేయించాలని డిమాండు చేశారు. ఆయన మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, తనకు ప్రభుత్వం కేటాయించిన 14 స్థలాల విలువ రూ.62 కోట్లు ఉంటుందని సిద్ధరామయ్య చెప్పిన వెంటనే ఈడీ అధికారులు దర్యాప్తునకు ఎందుకు ముందుకు వచ్చినట్లని ప్రశ్నించారు. ఈడీ తన దర్యాప్తును భాజపా నాయకులతో ప్రారంభించాలని డిమాండ్ చేశారు.



శివరాజ్ తంగడగి

సిద్ధు మా బాస్: డీకే



శివకుమార్

హుబ్బళ్లి: ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కిందే తాను పని చేస్తున్నానని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి మార్పునకు సంబంధించి పార్టీలో ఇప్పటి వరకు ఎటువంటి చర్చ జరగలేదన్నారు. సిద్ధరామయ్య నేతృత్వంలోనే మూడు నియోజకవర్గాల్లో జరిగే ఉప ఎన్నికల్లో అభ్యర్థులను నిలుపుతామని చెప్పారు. హరియాణాలో పార్టీ ఓటమికి సంబంధించి సీనియరు నేతలు హస్తినలో చర్చిస్తారని తెలిపారు.

భారీగా బంగారు, నగల స్వాధీనం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగలకు మెరుగు పేరుతో ఓ వ్యాపారిని మోసగించి బంగారు దొంగిలించిన రాజస్థానీ అంకుశ్‌కుమార్ (32)ను హలసూరు గేట్ పోలీసులు అరెస్టు మంగళవారం చేశారు. ఆ వ్యక్తి నుంచి రూ.38 లక్షల విలువైన బంగారు, రూ.10.99 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీసు కమిషనర్ దయానంద్ వెల్లడించారు. వ్యాపారంలో నష్టం రావడంతో నగరత్‌పేటలోని బంగారు నగల వ్యాపారుల వైపు అంకుశ్ దృష్టి మళ్లింది. మెరుగుపరుస్తానంటూ కొన్ని బంగారు నగలతో పాటు గట్టి బంగారునూ ఓ వ్యాపారి వద్ద తీసుకుని రాజస్థాన్‌కు పారిపోయినట్లు గుర్తించి పోలీసులు వేటాడారు. కొన్ని నగలను నగరంలోని వివిధ ప్రాంతాల్లో విక్రయించి నగదు చేసుకున్నట్లు కొత్వాల్ దయానంద్ చెప్పారు. మరిన్ని వివరాలు సేకరించే పనిలో పోలీసు అధికారులు నిమగ్నమైనట్లు వివరించారు.

మోదీజీ.. ప్రజల్లోకి రండి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : 'చాయ్ పే చర్చ' కాకుండా ప్రజల మధ్యకు వచ్చి చర్చించి.. వారి సమస్యలను తెలుసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హితవుపలికారు. ప్రజల మధ్యలోకి వస్తే వారి ఆహార సంస్కృతి, మౌలిక సమస్యలు తెలుసుకోవచ్చంటూ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మహారాష్ట్రలోని ఒక దళిత కుటుంబం ఇంటికి వెళ్లి వారితో కలిసి వంట చేస్తున్న వీడియోను ట్వీట్ చేసి.. దానితో పాటే ఈ వ్యాఖ్యలు చేశారు. కుల గణన నివేదికను అమలు చేయడానికి సంబంధించి విపక్ష నేత అశోక్ తనకు మద్దతుగా ప్రకటన చేయడాన్ని స్వాగతిస్తున్నానని సిద్ధరామయ్య మరో ట్వీట్‌లో హర్షాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత అంశాలకు సంబంధించి మీరు మనసు పాడు చేసుకోవద్దంటూ అదే ట్వీట్‌లో అశోక్‌కు హితవు పలికారు.

సిద్ధు కాదంటే డీకే

మైసూరు: ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్యే కొనసాగుతారని ప్రజా పనుల శాఖ మంత్రి సతీశ్ జార్కిహోళి స్పష్టం చేశారు. ఆయన మూడేళ్లు ఉంటారా లేదా ఐదేళ్లు ఉంటారా అనేది పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని చెప్పారు. దళిత నాయకుడే ముఖ్యమంత్రి కావాలన్న నినాదం కాంగ్రెస్‌లో లేదన్నారు. ఈసారి ఎన్నికలు జరిగిన అనంతరం తాను ముఖ్యమంత్రి స్థానానికి పోటీ పడతానని తెలిపారు. తనపై అభిమానం ఉన్న కార్యకర్తలు ముఖ్యమంత్రి మీరే కావాలని నినాదాలు చేయడం సహజమని అన్నారు. సిద్ధరామయ్య ఆ పదవి నుంచి పక్కకు తప్పుకొంటే.. డీకే శివకుమార్ సీఎంగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందన్నారు.

ఆ ఇద్దరే ఊతం..

విజయపుర : కేంద్ర ప్రభుత్వం కేవలం రెండు స్తంభాలపై నిలబడి ఉందని వక్ఫ్ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ ఎద్దేవా చేశారు. బిహారు ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ రెండు స్తంభాలని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, ఇతర పార్టీల నాయకులపై తప్పుడు ఆరోపణలు చేయడం, తమ పార్టీలో ఉన్న వారంతా సచ్చరిత కలిగిన వారిగా ప్రచారం చేసుకోవడం భాజపా నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి పీఠంపై తగరు (పొట్టేలు/సిద్ధరామయ్య) ఉందని ఆ స్థానం ఇప్పట్లో ఖాళీ కాదని పేర్కొన్నారు. సిద్ధరామయ్య అంటే భాజపా నాయకులకు భయమని, అందుకే ఆయనపై తప్పుడు ఆరోపణలు చేశారంటూ దుయ్యబట్టారు.



సిద్ధరామయ్య

ఆ ఊరు.. ఊపిరి పీల్చుకుంటోంది!



ఆనెగోడు నుంచి 15 కిలోమీటర్ల దూరంలో దావణగెరె

> అర్ధరాత్రి దాటిందంటే.. ఆ ఊరి శివార్లలో ఒకటే ఏడ్పులు.. పెడబొబ్బలు.. మృత్యునాదాలు. నెత్తుటి చారికలు ఆరకనే పారే కొత్త రుధిరధారలతో ఆ ప్రాంతం భయాందోళనలకు నెలవు. మోగే మరణమృదంగాలతో నిత్యం మృత్యుదేవత తారాడే ప్రాంతానికి కంటిమీద కునుకే కరవయ్యేది. నేడు.. ఆ పరిస్థితులు మారిపోయాయి. ఆ ఊరు నెమ్మదించింది.

దావణగెరె, న్యూస్‌టుడే : దావణగెరె సమీపంలోని ఆనెగోడు అంటే ప్రమాదాలకు పెట్టింది పేరు. బెంగళూరు నుంచి హుబ్బళ్లి- ధార్వాడ, బెళగావి, పుణె, మహారాష్ట్రను అనుసంధానం చేసే ఏకైక జాతీయ రహదారి ఇదే. ఆనెగోడు గ్రామంలో ఒకప్పుడు సింగిల్ రోడ్డు మాత్రమే ఉండేది. ప్రముఖ నటుడు శంకర్‌నాగ్ తొమ్మిదో దశకంలో తన చిన్నవయసులోనే ఈ ప్రాంతంలో సంభవించిన ప్రమాదంలో మరణించారు. ఈ రహదారిపై సంభవించిన ప్రమాదాల్లో ఎక్కువ ఇక్కడే జరిగేవి. వాటిని తగ్గించేందుకు దీన్ని డబల్ రోడ్డుగా అనంతరం నాలుగు వరుసల మార్గానికి ఇరువైపులా భారీ వృక్షాలు ఉండడం, వాహనాల దీప కాంతి తక్కువ కావడంతో ఇబ్బందులు ఎదురయ్యేవి. బెంగళూరు, పుణెల నుంచి వచ్చే వాహనదారులు ఎనిమిది గంటల ప్రయాణం చేసి ఇక్కడకు చేరుకునే సరికి అర్ధరాత్రి దాటి ఉండడంతో నిద్రమత్తులో ప్రమాదాల బారిన పడేవారని స్థానికుడు బసవరాజ్ తెలిపారు. అప్పట్లో నెలకు సగటున 15 వరకు ప్రమాదాలు సంభవించేవని వివరించారు. ప్రమాదం సంభవించిన ప్రతిసారీ గ్రామస్థులే స్పందించి, అంబులెన్సును పిలిపించడం, వాహనాల్లో చిక్కుకున్న వారిని రక్షించేవారిమని గతాన్ని గుర్తు చేసుకున్నారు. ఇపుడా ఇక్కట్లు పూర్తిగా నిలువరించడంతో ఊరంతా ఊపిరి పీల్చుకుంటోందన్నారు.

మార్గంగా అభివృద్ధి చేశారు. ప్రస్తుతం వంతెన నిర్మాణంతో పాటు ఆనెగోడు వద్ద ఆరు వరుసల మార్గాన్ని విస్తరించారు. నిర్మాణం పూర్తయ్యాక ఇక్కడ సంభవిస్తున్న ప్రమాదాల సంఖ్య 80 శాతం తగ్గిపోయాయి. గతంలో



దారి మధ్యలో.. గ్రామం వద్ద నిర్మించిన వంతెన



గుర్తుపట్టారా!

హాలివుడ్ నటుడిలా కనిపిస్తున్న ఈ యువకెరటమెవరో గుర్తించారా? మైసూరు మాజీ ఎంపీ ప్రతాప్‌సింహ కొత్త కేశాలంకరణతో మంగళవారం దర్శనమిచ్చారు. ఆయన ఫొటో షూట్ చేయించుకుని, సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. 'తిట్టొద్దురో... హుణసూరు ఆదివాసీల హెయిర్ ఆయిల్ ప్రకటన!' అంటూ తన ఫొటోకు శీర్షిక పెట్టారు. ఎంపీగా మరోసారి టికెట్ ఇవ్వకపోవడంతో భాజపా కార్యకలాపాలకు కాస్త దూరమైనట్లు కనిపించినా.. ఇటీవల చురుకుగా వ్యవహరిస్తూ వస్తున్న విషయం తెలిసిందే.

(న్యూస్‌టుడే, మైసూరు)



తమ కుటుంబ సభ్యులతో పోరాట సమితి ప్రతినిధులు

హెసరఘట్ట వనానికి రక్ష

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : రాజధాని నగర శివారు.. హెసరఘట్టలో 5010 ఎకరాల్లో విస్తరించిన గడ్డి భూములకు వన్యప్రాణుల రాష్ట్ర మండలి 'గ్రేటర్ హెసరఘట్ట కన్సర్వేషన్ రిజర్వు'గా గుర్తింపు ఇచ్చింది. దీని కోసం కొద్ది రోజులుగా చేస్తున్న పోరాటానికి చక్కని స్పందన లభించిందని 'హెసరఘట్టను కాపాడండి' సమితి ప్రతినిధి, వృక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు విజయ్ నిశాంత్ తెలిపారు. మూడేళ్లుగా కొనసాగించిన పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. హెసరఘట్టలో 356 ఎకరాల్లో గడ్డి భూములు, 383 ఎకరాల్లో బైరప్ప చెరువు, 165 ఎకరాల్లో బ్యాత చెరువు, 1356 ఎకరాల్లో హెసరఘట్ట చెరువు, 2750 ఎకరాల్లో పశువుల ఆసుపత్రి, కళాశాల ఉన్నాయి. ఈ భూముల్లో వివిధ రకాల ప్రాణులు, పక్షులు, కీటకాలు, మొక్కలు ఉన్నాయని గుర్తు చేశారు. హైకోర్టులో న్యాయపోరాటం, ప్రభుత్వానికి పలు వినతులు ఇచ్చిన అనంతరం ఈ భూములను కాపాడేందుకు మండలి భరోసా ఇస్తూ దీన్ని 'జీహెచ్‌సీఆర్'గా ప్రకటించడం పట్ల ఆయన హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ పోరాటానికి తమ సంస్థతో పాటు 18 స్వచ్ఛంద సంస్థలు సహకారాన్ని అందించాయని తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మైసూరు రాజవంశస్థుడు యదువీర్ కృష్ణదత్త ఒడెయారు స్వాగతించారు.

గాలి జనార్దన్‌రెడ్డి వాహనాల స్వాధీనం

గంగావతి,న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సిద్దరామయ్య కాన్వాయ్ వెళ్తున్న సమయంలో జీరో ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన ఆరోపణలపై గంగావతి శాసనసభ్యుడు గాలి జనార్దన్‌రెడ్డి, ఆయన అనుచరులకు చెందిన రెండు కార్లను గంగావతి పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు.


స్వాధీనం చేసుకున్న జనార్దన్‌రెడ్డి కారుతో పోలీసులు

సింధనూరు నుంచి గత శనివారం ముఖ్యమంత్రి కొప్పళ తాలూకా బసాపుర విమానాశ్రయానికి వెళ్తుండగా పోలీసులు జీరో ట్రాఫిక్ ఏర్పాటు చేశారు. వడ్డరహట్టిలో పార్టీ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తున్న జనార్దన్‌రెడ్డి కారును పోలీసులు అడ్డుకున్నారు. జనార్దన్‌రెడ్డి వాహనం విజాఖాన్ని దాటి ముఖ్యమంత్రి కాన్వాయ్‌కు ఎదురొచ్చింది. దీంతో గంగావతి సంచార నియంత్రణ పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు కార్లు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. దీనిపై జనార్దన్‌రెడ్డి స్పందిస్తూ జీరో ట్రాఫిక్ కోసం అరగంట ఎదురుచూసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రాక ఆలస్యం కావడంతో విజాఖాన్ని దాటి ముందుకు వెళ్లామన్నారు. బళ్లారిలో తన కుటుంబం ఆధ్వర్యంలో జరుగుతున్న ధార్మిక కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇలా చేయాల్సి వచ్చిందన్నారు. దీనిపై జిల్లా మంత్రి శివరాజ్ తంగడగి తనపై అక్రమంతరంగా వ్యాఖ్యలు చేసి కేసు నమోదు చేయాల్సిందిగా పోలీసులకు సూచించారన్నారు. పోలీసులు కేసు దాఖలు చేసినందుకు వాహనాలు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఇక్కడ తప్పించుకుని.. అక్కడ చిక్కాడు

14 ఏళ్ల అనంతరం నిందితున్ని పట్టుకున్న పోలీసులు


ఆబిద్‌ఖాన్ (నాడు, నేడు)

గంగావతి, న్యూస్‌టుడే: కొప్పళ కారాగారం నుంచి తప్పించుకుని పరారైన ఖైదీని గంగావతి పోలీసులు 14 ఏళ్ల తరువాత పట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్ ప్రతాప్‌గఢ్ జిల్లాకు చెందిన ఆబిద్‌ఖాన్‌పై గంగావతి పోలీస్‌స్టేషన్‌లో అక్రమ ఆయుధం కేసు నమోదైంది. కొప్పళ కారాగారంలో న్యాయాంగ కస్టడీలో ఉన్న ఈ నిందితుడు 2010లో తప్పించుకుని పారిపోయాడు. ఉత్తరప్రదేశ్‌లో మరో కేసు నమోదైంది. రాయబరేలి జిల్లా కారాగారంలో న్యాయాంగ బంధనంలో ఉన్నట్లు తెలియడంతో కొప్పళ గ్రామీణ, గంగావతి పట్టణ పోలీసులు అక్కడకు వెళ్లి ఈ నెల 5న నిందితుడిని గంగావతికి తీసుకొచ్చినట్లు అదనపు ఎస్పీ ఆర్.హేమంత్ కుమార్ తెలిపారు.

అత్యాచార నిందితునికి శిక్ష

గంగావతి, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ నిందితునికి కొప్పళ పోక్సో న్యాయస్థానం శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. కారటగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని యరడోణాలో 2017లో ఈ సంఘటన జరిగింది. బహిర్భూమికి వెళ్లిన బాలికపై మారెప్ప సోంపుర అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడినట్లు కేసు నమోదైంది. పోలీసులు దర్యాప్తు చేసి న్యాయస్థానానికి అభియోగపత్రం సమర్పించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి డి.కె.కుమార్ నిందితునికి పదేళ్ల జైలుశిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ప్రభుత్వ న్యాయవాది గౌరమ దేశాయ్ తెలిపారు.

నవలిపై తెలుగు రాష్ట్రాల సీఎంలతో చర్చిస్తాం

ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడి


నవలి, తుంగభద్ర జలాశయాల సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న మూడు జిల్లాల ఎమ్మెల్యేలు

సింధనూరు, న్యూస్‌టుడే: దసరా హడావిడి ముగిసిన వెంటనే నెల రోజులలోగా నవలి జలాశయం నిర్మాణం అనుమతి కోసం ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రుల సమావేశం ఏర్పాటు చేసి అంతిమంగా ఈ విషయాన్ని తేల్చేస్తాం.. ఇక నాన్చుడు ఉండదు, తెలుగు రాష్ట్రాల సీఎంలను కర్ణాటకకు ఆహ్వానించడం లేదా మేమే అక్కడకు వెళ్లి కలవడమో ఏదోటి జరుగుతుంది.. మొత్తానికి నెలలో నవలిపై ఓ నిర్ణయం తీసుకుంటామని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ రాయచూరు, బళ్లారి, కొప్పళ జిల్లాల ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు. సింధనూరులో జరుగుతున్న నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన 'సింధనూరు రైతు దసరా' వేడుకను ప్రారంభించి డీకేశి మాట్లాడారు. తొలుత స్థానిక ఎమ్మెల్యే బాదర్లి మాట్లాడుతూ.. తుంగభద్రలో వృథాగా పోతున్న జలాలు, పూడిక, నవలి జలాశయం ఆవశ్యకతల గురించి మాట్లాడారు. అనంతరం వేదికపై ఉన్న మూడు జిల్లాల ఎమ్మెల్యేలు, ఇతర పార్టీల నాయకులు ఇదే విషయంపై డీకేశికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఉప ముఖ్యమంత్రి స్పందించి మాట్లాడారు. తుంగభద్ర జలాశయాన్ని కాపాడుకోవడంలో మా ప్రభుత్వం కట్టుబడి ఉందని గుర్తు చేశారు. ఇటీవల 19వ క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయినప్పుడు నిండుకుండలా ఉన్న తుంగభద్ర జలాశయం నీటిని ఎలా కాపాడుకుంటారో అని యావత్ దేశం ఆసక్తిగా ఎదురుచూసింది. ఆరు రోజుల్లో పనులు ముగించి అందరూ అవాక్కయ్యేలా చేశాం.. ఈ విషయంలో సీనియర్ ఇంజినీర్ కన్నయ్యనాయుడి సాహసం మెచ్చుకోదగ్గదని కొనియాడారు. అందుకే ఈనాడు దసరాను


రైతు దసరాలో ఎడ్లబండ్లను ప్రదర్శిస్తున్న రైతులు


రైతులను రంజింపజేస్తున్న కళాకారులు

మీరంతా ఆనందంగా ఆచరించగలుగుతున్నారని రైతులతో అన్నారు. మిగిలిన అన్ని గేట్లను సరిచేయించి తుంగభద్రను రక్షించుకుంటామని చెప్పారు. చక్కని సంకల్పం ఉంటే ఏదైనా విజయవంతమవుతుందని అన్నారు. ఇకపై ఏటా ఇదేవిధంగా సింధనూరు దసరాను వైభవంగా ఆచరించాలని సూచించారు. తొలుత ఆయన గాంధీకూడలిలో రైతుల ఎడ్లబండి ఊరేగింపును ప్రారంభించారు. ఆపై ఏపీఎంసీలో రైతుమేళా వ్యవసాయ వస్తు ప్రదర్శన ప్రారంభించారు. ఏపీఎంసీ యార్డు అంతా రైతుల వివిధ కార్యక్రమాలతో సందడిగా మారింది. కార్యక్రమంలో వ్యవసాయ మంత్రి చలువరాయస్వామి, కొప్పళ జిల్లా బాధ్య మంత్రి తంగడిగి, ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి మాట్లాడారు. కాంగ్రెస్ నేత సలీం అహ్మద్, ఎమ్మెల్యేలు దద్దల్, ఆర్.బసనగౌడ, రాఘవేంద్ర హిట్నాళ్, బీఎం.నాగరాజ్, ఎమ్మెల్సీ బయ్యాపూరు, ఉత్సవ సమితి నాయకులు కేవీ, నాడగౌడ పాల్గొన్నారు.


హనుమనాళలో గ్రామస్థుల సమస్యలు ఆలకిస్తున్న కొప్పళ పాలనాధికారి నళిన్ అతుల్

పాలనాధికారి పర్యటన

గంగావతి, న్యూస్‌టుడే: కొప్పళ జిల్లా హనుమనాళలో జనస్పందన పురస్కరించుకుని పాలనాధికారి మంగళవారం గ్రామాల్లో పర్యటించి సమస్యలు ఆలకించారు. బాదామి రహదారిలోని ప్రభుత్వ పీయూ కళాశాలకు వెళ్లి అక్కడ రూ.45 లక్షల కేకేఆర్‌డీబీ నిధులతో నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని పరిశీలించారు. పనుల జాప్యంపై అధికారుల వివరణ అడిగారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కడివాళ గ్రామానికి చెందిన పందుల పెంపకం రైతులతో చర్చించారు. పందుల పెంపకం లాభదాయకంగా ఉందని రైతు గంగయ్య కలాపుర మఠ ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన వెంట పశుసంవర్ధక శాఖ అధికారి మల్లయ్య ఉన్నారు.

మార్కులు తగ్గాయని చితగ్గొట్టిన వార్డెన్

విజయపుర: గణితంలో తక్కువ మార్కులు వచ్చాయని ఒక విద్యార్థి (15)ని కోచింగ్ సెంటర్ వార్డెన్ ఇష్టం వచ్చినట్లు కొట్టాడు. ఒళ్లంతా వాతలు తేలిన విద్యార్థికి ప్రాథమిక చికిత్స అందించి, జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. విజయపుర శివార్లలోని ఇట్టంగిహాళ గ్రామంలో ఎక్సలెంట్ కోచింగ్ సెంటర్‌లో దావణగెరె విద్యార్థి చదువుతున్నాడు. తొడ, వెన్నుభాగంలో వాతలు తేలడంతో అతను కూర్చునేందుకూ ఇబ్బంది ఎదుర్కొన్నాడు. బాలుని తల్లిదండ్రుల ఫిర్యాదుతో కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకుడు బసవరాజ కవలగి, ఇతర సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దారికాసిన మృత్యువు.. అర్ధాంతరంగా తీరిన ఆయువు

ఈతకెళ్లి ముగ్గురు బాలల మృతి

హొసపేటె, న్యూస్‌టుడే: చెరువులో ఈతకెళ్లిన ముగ్గురు బాలురు అందులో మునిగి మృతి చెందిన ఘటన కూడ్లిగి తాలూకా కుమతిలో మంగళవారం జరిగింది. మృతుల్లో ఇద్దరు సోదరులు ఉన్నారు. కుమతికి చెందిన జయణ్ణ లక్ష్మీ దంపతుల కుమారులు వినయ్(14), గురు(11), సోమణ్ణ నాగమ్మ దంపతుల కుమారుడు సాగర్ (11)లు ఉదయం 11 గంటలకు గ్రామ శివారులోని చెరువులో ఈతకెళ్లారు. ఇటీవలే భారీ వర్షాలు కురిసి, చెరువు భర్తీ అయింది. లోతు తెలియని బాలురు అందులో దిగి మునిగిపోయారు. మధ్యాహ్నం ముగ్గురి మృతదేహాలు చెరువులో తేలడం చూసిన స్థానికులు బాలుర తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఉన్న ఇద్దరు కుమారులను కోల్పోవడంతో జయణ్ణ లక్ష్మీ దంపతుల రోదన మిన్నంటింది. విషయం తెలిసి ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కానాహొసహళ్లి ఠాణా పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.


సాగర్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి


వినయ్, గురు మృతదేహాల వద్ద జయణ్ణ లక్ష్మీ దంపతుల కన్నీరుమున్నీరు

బైకును కారు ఢీకొని ఇద్దరు..

హొసపేటె, న్యూస్‌టుడే: బైకును కారు ఢీకొన్న ఘటనలో బైకు చోదకుడు హనుమేశ్ (38), వెనుక కూర్చొన్న యమనూర(24)లు మృతిచెందారు. ఈ ఘటన సోమవారం రాత్రి తాలూకాలోని దేవలాపుర క్రాస్‌లో జరిగింది. దేలాపురకి చెందిన ఇద్దరు హొసపేటె నుంచి రాత్రి స్వస్థలం తిరిగొస్తుండగా ఓ మలుపులో కారు ఢీకొంది. తీవ్ర గాయాలైన ఇద్దరినీ బళ్లారి విమ్స్‌కు తరలించగా, అక్కడ చికిత్స అందుకుంటూ మృతిచెందారు. మరియమ్మనహళ్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.


హనుమేశ్, యమనూర

నవరాత్రుళ్లు జరిగేవేళ ఉమ్మడి బళ్లారి జిల్లాలో జరిగిన రహదారి ప్రమాదాలు, ఆత్మహత్యలు అంతులేని విషాదాన్ని నింపాయి. దసరా సెలవులొచ్చాయని సరదాగా ఈతకెళ్లిన ముగ్గురు చిన్నారులు శాశ్వత లోకాలకు వెళ్లిపోయారు. కన్నవారికి అంతులేని శోకాన్ని మిగిల్చారు.. మరో ఘటనలో కాసేపటికి స్వస్థలం చేరుకుంటామని బైకుపై బయలుదేరిన ఇద్దర్ని కారు రూపంలో ఎదురొచ్చిన మృత్యువు అమాంతం కబళించింది. పండగపూట వారింట కొండంత దుఃఖాన్ని మిగిల్చింది.. కూలీలతో వెళ్తున్న వాహనం బోల్తాపడి బాలుడు అసువులు బాయడం..మరో ముగ్గురి పరిస్థితి విషమంగా మారిన ఘటన దిగ్భ్రాంతిని గొలిపింది. ఇంకో సంఘటనలో జీవన సహచరి అకాల మరణాన్ని జీర్ణించుకోలేని భర్త తాగుడుకు బానిసవడం.. వ్యసనం మానుకోవాలన్న కుమారుడి మాట పెడచెవిన పెట్టడంతో మనస్తాపంతో కొడుకు మృతిచెందడం.. కొడుకూ భార్య లేని జీవితం తనకెందుకని చివరికి తండ్రీ తనువు చాలించిన విషాదం కంటతడి పెట్టించేదే.. మరో ఘటనలో దంపతుల ఉసురు తీసింది మృత్యువు. ఏం కష్టమొచ్చిందో ఏమోగాని కలహాల కాపురం చేయలేమని ఆ దంపతులిద్దరూ తమ ఇద్దరు బిడ్డలను అనాథల్ని చేసి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చూపరుల హృదయాలను బరువెక్కించింది. విజయనగర జిల్లా పరిధిలో జరిగిన ఈ సంఘటనల సమాహారం.

తండ్రీ కొడుకుల బలవన్మరణం

హొసపేటె, న్యూస్‌టుడే: తల్లిని కోల్పోయిన కొడుకు అదే బాధతో జీవితంపై విరక్తితో ఊరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన కొడుకే పోయిన తరువాత తనదేముందని తండ్రి పురుగు మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన హడగలి తాలూకా చిక్కకొళచిలో జరిగింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన వివరాలు.. చిక్కకొళచి గ్రామానికి చెందిన రైతు దొడ్డ భీమప్పనవర పరసప్ప(48) భార్య కొంత కాలం క్రితం మృతిచెందింది. అదే బాధతో అతను తాగుడుకు అలవాటుపడ్డాడు. తాగుడు మానమని కొడుకు దొడ్డభీమప్పనవర అజ్జప్ప(17) తండ్రితో తరచూ గొడవపడేవాడు. తండ్రి తీరు మారకపోవడంతో సోమవారం సాయంత్రం ఊరి శివారులోని పొలానికి వెళ్లి తీవ్ర మనస్తాపంతో ఓ చెట్టుకు ఊరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు పోయాడన్న బాధతో అదే రోజు అర్ధరాత్రి తండ్రి ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై హిరేహడగలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో దంపతుల విషాదాంతం

హొసపేటె, న్యూస్‌టుడే: కుటుంబ కలహం దంపతుల ఆత్మహత్యకు దారితీసింది. ఈ సంఘటన హగరిబొమ్మహళ్లి రామ్‌రహీమ్ నగర్‌లో సోమవారం రాత్రి జరిగింది. హగరిబొమ్మనహళ్లికి చెందిన మంజునాథ్ వివాహం 2016లో అదే తాలూకా మగిమావినహళ్లికి చెందిన గీతాతో జరిగింది. దంపతులకు ఇద్దరు బిడ్డలు ఉన్నారు. కూలి పనులు చేస్తున్న మంజునాథ్ ఇటీవల తాగుడుకు అలవాటుపడ్డాడు. దీంతో పిల్లల పోషణ, కుటుంబ నిర్వహణ కష్టంగా మారడంతో భార్య తీవ్రంగా మందలించేది. ఇదే అంశంపై దంపతులు రాత్రి మళ్లీగొడవపడి, తీవ్ర మనస్తాపంతో తలో చీరతో ఇంట్లో దూలానికి ఊరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. దంపతుల మృతితో ఆరు, నాలుగేళ్ల ఇద్దరు బిడ్డలు అనాథలయ్యారు. హగరిబొమ్మనహళ్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

'దక్షిణ' బరిలో నలుగురు

మంగళూరు, న్యూస్‌టుడే : దక్షిణ కన్నడ జిల్లా స్థానిక సంస్థల నుంచి విధానపరిషత్తుకు ఈ నెల 21న జరిగే ఉప ఎన్నికల్లో నలుగురు అభ్యర్థులు బరిలో మిగిలారు. భాజపా నుంచి కిశోర్ కుమార్, కాంగ్రెస్ అభ్యర్థిగా రాజు పూజారి, ఎస్‌డీపీఐ తరఫున అన్వర్ సాదత్, స్వతంత్ర అభ్యర్థిగా దినేశ్ ఉళ్లాల్ పోటీలో ఉన్నారు. మరో స్వతంత్ర అభ్యర్థి మమ్మద్ రియాజ్ తన నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకున్నారు. ఇక్కడి నుంచి గెలుపొందిన భాజపా అభ్యర్థి కోట శ్రీనివాస పూజారి లోక్‌సభకు ఎన్నిక కావడంతో ఇక్కడ ఉప ఎన్నిక వచ్చింది. ఉడుపి, దక్షిణ కన్నడ జిల్లాలలో 392 పోలింగ్ బూత్‌లలో 6037 మంది ఓటర్లు ఉన్నారు.

ఉద్యోగం పేరిట వంచన

కార్వార, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వంచనలకు పాల్పడుతున్న శ్రీధర్ కుమటాకర్ అనే వ్యక్తిని కార్వార పోలీసులు అరెస్టు చేశారు. ఉద్యోగాల పేరిట పలువురు నిరుద్యోగుల నుంచి నగదు వసూలు చేసిన నిందితుడు కొందరు ఒత్తిళ్లు తేవడంతో చెక్కులు ఇచ్చాడు. అవి బౌన్సు కావడంతో కోర్టులో కేసులు వేశారు. విచారణకు హాజరు కాకపోవడం, పలువురు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కార్యాచరణ నిర్వహించి నిందితుడ్ని అరెస్టు చేశారు.

వాహనం బోల్తా పడి బాలుడి దుర్మరణం

మరో 26 మందికి గాయాలు


రోదిస్తున్న కుటుంబసభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: పొలం పనులకు కూలీలను తీసుకుని వెళ్తున్న వాహనం బోల్తా పడటంతో ఓ బాలుడు మృతిచెందగా, మరో 26 మందికి గాయాలయ్యాయి. మృతిచెందిన బాలుడు బళ్లారి తాలూకా మోకాకు చెందినట్లుగా గుర్తించారు. మోకాకు చెందిన కూలీలు పొలం పనులకు ఓ వాహనంలో వెళ్తుండగా, తాలూకా సిందవాళ క్రాస్ వద్ద వాహనం ముందు టైరు పేలడంతో అదుపు తప్పి రహదారి పక్కన బోల్తా పడింది. వాహనంలో ఉన్న రఘు(16) అనే బాలుడు తీవ్రంగా గాయపడి అక్కడే మృతిచెందాడు. దుర్గమ్మ(22)తో పాటు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మరో 22 మంది స్వల్పంగా గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మోకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బళ్లారి బీఎంసీఆర్‌సీ ట్రామాకేర్ ఆసుపత్రికి తరలించారు. బాలుడి మృతదేహాన్ని శవాగారానికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. కూలీలు వెంట తీసుకుని వెళ్తున్న అన్నం క్యారియర్లు చెల్లా చెదురుగా పడిపోయాయి. రహదారి పక్కన వాహనం పడిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.


బోల్తా పడిన వాహనం వద్ద చెల్లాచెదురుగా పడిన ఆహారం, వస్తువులు

అన్నను కడతేర్చిన తమ్ముడు

బెళగావి: భూ వివాదానికి సంబంధించి సునీల్ ఖోత్ (45) అనే వ్యక్తిని తన సహచరునితో కలిసి అనిల్ ఖోత్ అనే అతని సోదరుడే హత్య చేసినట్లు సంబంధిత పోలీసులు సోమవారం వెల్లడించారు. భూవివాదం, నడక దారి విషయంలో అన్నదమ్ముల మధ్య గత కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. తమ్మునిపై సదలగా ఠాణాలో ఫిర్యాదు చేసేందుకు వెళుతున్న సమయంలో దారి కాచి హత్య చేసి నిందితులు పరారయ్యారు.

మముబ్రోవుమా..మహాలక్ష్మీ


స్కందమాతగా ఏళుమక్కళతాయి


బాలాజీ క్యాంపులో అమ్మవారు


మహాలక్ష్మి విద్యానగర్ దుర్గా అమ్మవారు


తాయమ్మకు పుష్పాలంకరణ


సంతోషిమాతకు లలితాదేవి అలంకరణ


లక్ష్మీదేవిగా చిన్నదుర్గమ్మ

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: దసరా నవరాత్రుల్లో భాగంగా ఆరోరోజు అమ్మవార్లకు మహాలక్ష్మిగా అలంకరించి పూజలు జరిపారు. నగర ఆరాధ్యదేవత కనకదుర్గమ్మ ఆలయంలో కుంకుమార్చన పూజలు చేసి అమ్మవారిని అలంకరించారు. సంతోషిమాత, తాయమ్మ, సుంకల్లమ్మ, మారెమ్మలకు పుష్పాలతో, విద్యానగర్ అమ్మవారు, చిన్నదుర్గమ్మ, నీలకంఠేశ్వరీ, నాగేశ్వరిలకు మహాలక్ష్మిగా, తుల్జాభవానికి గాజులమ్మ, యల్లమ్మకు శాకంబరి, స్కందమాతగా ఏళుమక్కళతాయి, బాలాజీ క్యాంపు అమృతేశ్వర ఆలయంలో నాగదేవత అలంకరణలో అమ్మవారికి విశేష పూజలు జరిపారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

మాన్వి: సిరివార తాలూకా నీలగల్ క్యాంపులో దసరా శరన్నవరాత్రి సందర్భంగా సామూహిక కుంకుమార్చన పూజ ఘనంగా జరిగింది. మంగళవారం జి.వి.వి.సత్యనారాయణశర్మ, రవికిరణ్‌శర్మల సాన్నిధ్యంలో స్థానిక రామాలయంలో మహిళలు అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. క్యాంపునకు చెందిన మహిళలు సామూహికంగా కుంకుమపూజ చేశారు. అమ్మవారికి లక్ష్మీదేవి అలంకరణ చేశారు. మాన్వి పట్టణంలోని వాసవీ కల్యాణ మంటపంలో స్కందమాత దుర్గ అలంకరణ నిర్వహించారు. ఆర్యవైశ్య పండితుల ఆధ్వర్యంలో సామూహిక హోమపూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో సంఘం అధ్యక్షుడు ఆర్.ముత్తురాజ్‌శెట్టి, శివశంకర్‌శెట్టి, వాసవీ మహిళా మండళి, వాసవీ యువక సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హొసపేటె: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక సోమవంశ సహస్రార్జున క్షత్రియ సమాజం ఆధ్వర్యంలో బళ్లారి మార్గంలోని అంబాభవాని ఆలయంలో రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. సుమారు పాతికమంది చిన్నారులు అమ్మవారుల వేషధారణలతో మురిపించారు.


హొసపేటె: నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో మిన్నంటాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాలు, వీధులను తోరణాలతో అలంకరించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజిస్తున్నారు. పట్టణంలోని తళవారకేరి రాంపుర దుర్గమ్మ, మ్యాసకేరిలోని కొంగమ్మ, హులిగెమ్మలను పలు రకాల పూలతో అలంకరించి పూజించారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

సిరుగుప్ప శరన్నవరాత్రులు పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం అయ్యప్ప స్వామి, మారికాంబ, కాళికా కమ్మటేశ్వర, ప్యాటి ఆంజినేయ స్వామి, ఆదోని రహదారిలోని తాయమ్మదేవి, అంబాభవానీ, శ్రీనగర్ క్యాంపుల్లో ఆలయాల్లో అమ్మవారికి పూజలు చేసి ధనలక్ష్మి, గోడంబి, బాదామి, తదితర వాటితో అలకంరించారు.


సింధనూరు: సింధనూరు తాలూకా తెలుగువారి క్యాంపుల్లో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లను కరెన్సీ నోట్లతో అలంకరించారు. కొన్నిచోట్ల నోట్లను మాలలుగా చేసి అమ్మవారి మెళ్లో వేయగా మరికొన్నిచోట్ల గోడలకు నోట్లను అంటించి అలంకారాలు చేసి భక్తిని చాటుకున్నారు. బప్పూరు మార్గంలోని దేవీక్యాంపు కోదండ రామాలయంలో సీతారామలక్ష్మణులను నోట్లతో అలంకరించారు. స్థానిక శ్రీవరసిద్ధి వినాయక దేవస్థానంలో మంగళవారం పూజకు విచ్చేసిన మహిళలంతా గులాబీ రంగు చీరలు ధరించి కుంకుమార్చనల్లో పాల్గొన్నారు.


చెళ్లకెరలో అన్నపూర్ణేశ్వరిగా


హొసపేటె తళవారకేరి రాంపుర దుర్గమ్మ


మ్యాసకేరి కొంగమ్మ, హులిగెమ్మ


తుల్జాభవానికి గాజుల అలంకారం


శాకంబరిగా రేణుకయల్లమ్మ


స్కందమాత దుర్గ అలంకారం


సింధనూరు పగడదిన్ని క్యాంపులో


నీలగల్‌క్యాంపులో పూజలు చేస్తున్న మహిళలు


సింధనూరు రామకిశోర్ కాలనీలో గులాబీ రంగు చీరల్లో భక్తులు


హొసపేటె: అమ్మవార్ల వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

బళ్ళారి
• బళ్ళారి • రాయచూరు

మారెమ్మ దేవస్థానం సమితి అధ్యక్షుడిగా నరసణ్ణ

రాయచూరు, న్యూస్‌టుడే: బాల మారెమ్మ దేవస్థానం (తిమ్మాపూరపేట) సమితి అధ్యక్షుడిగా కె.టి. నరసణ్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేవస్థానం ఆవరణలో జరిగిన సమావేశంలో సమితి ప్రతినిధులంతా ఆయన పేరును ప్రతిపాదించారు. దీంతో పోటీ లేకుండా గెలిచినట్లు నిర్వాహకులు ప్రకటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కె.శాంతప్ప మాట్లాడుతూ ధార్మిక విధి విధానాలను అనుసరించాలని, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. సేవా కార్యకలాపాలను విస్తరించాలని సమితికి సలహా ఇచ్చారు. ఈ సందర్భంగా పేట ప్రముఖులు తిమ్మప్ప నాడగౌడ, పూజారి శరణప్ప, మాస్టర్ మల్లయ్య, రమేష్, వడ్డి హనుమంతు, కడుగోలు గోపి తదితరులు నరసణ్ణకు సన్మానించారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఆందోళన

రాయచూరు: కన్నడ మాధ్యమాన్ని ఎత్తివేసిన రాయచూరు తాలూకా శక్తినగర్‌లోని దయానంద ఆంగ్లో వేదిక పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని 'జిల్లా కన్నడ క్రియా సమితి' జిల్లా యంత్రాంగాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రతినిధులు మంగళవారం ఇక్కడి టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో ధర్నాకు దిగారు. సంబంధిత అధికారికి వినతి పత్రం అందజేశారు. ఆర్టీపీఎస్‌కు చెందిన ఈ పాఠశాలను 2009-10లో ఆంగ్లో వేదిక ప్రైవేట్ పాఠశాలకు అప్పగించారని, ఆ సమయంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు ఆంగ్లం, కన్నడ మాధ్యమాలు ఉండేవన్నారు. 2013-14 నుంచి ఏటా ఒక్కో తరగతిలో కన్నడ మాధ్యమాన్ని తొలగించారని ఫిర్యాదు చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి కన్నడ మాధ్యమం ఆఖరిదని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా సరిహద్దు గ్రామాల విద్యార్థులు కన్నడలో చదివే అవకాశాన్ని కోల్పోతారన్నారు.

28న ఉద్యోగుల సంఘం ఎన్నికలు

సిరివార, (మాన్వి) : ఈ నెల 28న స్థానిక ప్రభుత్వ బాలుర ప్రాథమికోన్నత పాఠశాలలో ఉద్యోగుల సంఘానికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ప్రదీప్‌గౌడ నందరెడ్డి తెలిపారు. ఈ నెల 9 నుంచి 18 వరకు నామినేషన్లు అందించవచ్చు. 19న నామినేషన్ల పరిశీలన, 21న ఉపసంహరణ ఉంటుంది. 28న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

సిరుగుప్పలో ఎన్నికల ఏర్పాట్లు



ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లింగరాజ రెడ్డి

సిరుగుప్ప : ఈనెల 28న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నిర్వాహకులను ఎంపికకు ఎన్నిక నిర్వహిస్తామని సంఘం తాలూకా అధ్యక్షుడు లింగరాజ రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం ఉద్యోగుల సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2024 నుంచి 2029 వరకు ఐదేళ్ల కాలావధికి ఎన్నుకునేందుకు ఈనెల 9న నామినేషన్ల స్వీకరణ, 18న నామినేషన్లు వేసేందుకు చివరితేదీ అన్నారు. 19న పరిశీలన, 21న ఉపసంహరణకు చివరి తేదీ అని, 28న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నిక నిర్వహించి అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారని పేర్కొన్నారు.

చిగురుపాటి సేవలు ప్రశంసనీయం



చిగురుపాటి ప్రసాద్‌ను సన్మానించిన హుబ్బళ్లి - ధార్వాడ అభివృద్ధి వేదిక సభ్యులు

హుబ్బళ్లి (కారటగి), న్యూస్‌టుడే: ఉత్తర కర్ణాటక ప్రాంతంలో హుబ్బళ్లి స్వర్ణ సమూహ అధిపతి చిగురుపాటి వి.ఎస్.వి. ప్రసాద్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని హుబ్బళ్లి - ధార్వాడ అభివృద్ధి వేదిక అధ్యక్షుడు విజయ సంకేశ్వర కొనియాడారు. కర్ణాటక విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ అందుకున్న చిగురుపాటి ప్రసాద్‌ను వేదిక సభ్యులు మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జన్మించిన ప్రసాద్ హుబ్బళ్లిని కర్మ భూమిగా చేసుకుని సేవలు అందిస్తున్నారు. కోవిడ్ సమయంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఆయన ఎంతో సాయం చేశారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి, క్రీడలకు ఆర్థిక సాయం అందించి ప్రోత్సహిస్తున్న ఆయన అందరికీ ఆదర్శమన్నారు. సన్మాన గ్రహీత చిగురుపాటి ప్రసాద్ మాట్లాడుతూ 'కాయకవే కైలాసం' అన్న బసవణ్ణ మార్గంలో ముందుకు సాగుతున్నానని తెలిపారు. వేదిక ఉపాధ్యక్షులు కె.మహదేవప్ప, హెచ్.ఎన్.నందకుమార్, అశోక్ శెట్టర్, కార్యదర్శి జగదీశ్ హిరేమఠ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని వైభవంగా ఆచరిద్దాం



ప్రసంగిస్తున్న తహసీల్దార్ విశ్వనాథ్

సిరుగుప్ప, న్యూస్‌టుడే: మహర్షి వాల్మీకి జయంతిని వైభవంగా ఆచరిద్దామని తహసీల్దార్ హెచ్.విశ్వనాథ్ పేర్కొన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయ ప్రాంగణంలో వాల్మీకి జయంతి పూర్వ సిద్ధతా సమావేశం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ తాలూకా స్థాయి అధికారులు, వాల్మీకి సమాజం ప్రతినిధులు, సంఘ, సంస్థల ప్రతినిధులు తమ సలహాలు, సూచనలు అందిస్తే అన్నింటిని పరిగణనలోకి తీసుకుని 17న జయంతిని ఆచరిస్తామని పేర్కొన్నారు. వాల్మీకి విద్యాభివృద్ధి ట్రస్ట్ అధ్యక్షుడు బి.ఎం.సతీష్ మాట్లాడుతూ వాల్మీకి తాలూకా సంఘం కమిటీ పదాధికారులను నూతనంగా ఎన్నుకున్నాం. ఈ సంవత్సర సమాజం ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరవుతారని, వచ్చిన వారికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ, వాల్మీకి తాలూకా సంఘం అధ్యక్షుడు టి.నరసింహనాయక్, తాలూకా స్థాయి అధికారులు, సంఘ, సంస్థల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమివ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న తాలూకా పంచాయతీ అధ్యక్షుడు రాజశేఖర్

కారటగి, న్యూస్‌టుడే: అంటువ్యాధుల నియంత్రణకు గ్రామాల్లో స్వచ్ఛతకు ప్రాధాన్యమివ్వాలని కనకగిరి తాలూకా పంచాయతీ అధికారి కె.రాజశేఖర్ సూచించారు. తాలూకాలోని గ్రామ పంచాయతీల పారిశుద్ధ్య కార్మికులు, స్వసహాయ సంఘాల సభ్యుల ఒక రోజు చర్చా కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో స్వచ్ఛతను కాపాడేందుకు పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయం. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వ పథకాలను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ ఫెలోషిప్ తాలూకా ప్రతినిధి డాక్టర్ ఎం.తిప్పేస్వామి వివిధ ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. తాలూకాలోని 11 గ్రామ పంచాయతీల అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల దొంగల అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకొన్న గొర్రెలు

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: గొర్రెలను ఎత్తుకెళ్తున్న దొంగలను పోలీసులు బంధించిన సంఘటన మొళకాల్మూరు తాలూకాలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. మొళకాల్మూరు తాలూకా రాంపురం వద్ద బళ్లారి- బెంగళూరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి వాహనాన్ని నిలుపుకొని అనుమానాస్పదంగా తిరుగుతున్న దావణగెరె జిల్లా హరిహర తాలూకాకు చెందిన ఖలీల్ ఉల్లా, మహమ్మద్, ఖలీల్‌లను గస్తీ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. విచారణలో వారు గొర్రెలను చోరీ చేయడానికి వచ్చినట్లు తెలిపారని పోలీసులు గుర్తించారు. దేవసముద్రం పరిసర గ్రామాల్లో ఇటీవల రాత్రిపూట గొర్రెలను చోరీ చేసి వాహనాల్లో తరలిస్తున్న సంఘటనలపై పలు ఫిర్యాదులు అందాయి. శనివారం రాత్రి రామసాగర గ్రామంలోని సణ్ణగంగప్పకు చెందిన 12 గొర్రెలను దుండగులు చోరీ చేశారు. బాధితుడు రాంపుర పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నిందితులను అదుపులోనికి తీసుకొని ప్రశ్నించగా అసలు విషయం బయట పడింది. నిందితులకు చిత్రదుర్గం, దావణగెరె, బళ్లారి జిల్లాల్లో పలు చోరీ కేసులతో సంబంధం ఉందని పోలీసులు తెలిపారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

08-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1632.00	1616.28
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	11,954	2235
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	11,654	9,536
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.773	51.519

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

ప్రతిభకు పట్టం..సేవకు సత్కారం



కార్యక్రమానికి హాజరైన వివిధ మఠాధీశులు

బళ్లారి, న్యూస్‌టుడే: సామాజిక సేవలో మంత్రి సంతోష్ ఎస్.లాడ్ ముందు వరుసలో ఉంటారు. తాలూకాలో ప్రతిభావంత విద్యార్థులను గుర్తించి సన్మానించి ఆర్థిక సాయం చేయడమే ఆయన సేవకు నిదర్శనమని పలువురు మఠాధీశులు కొనియాడారు. మంత్రి సంతోష్ ఎస్.లాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సండూరు ఏపీఎంసీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 3000 మంది ప్రతిభావంత విద్యార్థులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు, పౌరకార్మికులు, వివిధ రంగాల్లో ప్రతిభ సాధించిన వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీలు మాట్లాడుతూ ప్రజాజీవితంలో నిస్వార్థంతో సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ముందుకు రావాలన్నారు. మంత్రి సంతోష్ ఎస్.లాడ్ కొన్నేళ్లుగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పలువురు కొనియాడారు. ప్రతిభావంత విద్యార్థులను గుర్తించి సన్మానించడం వల్ల మరింత ఉత్సాహంగా ముందుకు వెళ్తారన్నారు. లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్ మాట్లాడుతూ మంత్రి సంతోష్ ఎస్.లాడ్ ఈ ప్రాంతానికి మణెయ మగ (ఇంటి కొడుకు). ఆయనకు సండూరు తాలూకాతో విడదీయరాని బంధం ఉందన్నారు. ప్రజా సేవలో ఆనందంగా పొందుతున్నారు. నేడు సన్మానం పొందిన విద్యార్థులు కృషి, పట్టుదలతో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి అనుకున్న లక్ష్యం సాధించాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు సమాజ సేవలో ముందుకు వెళ్లాలన్నారు. ఎమ్మెల్యే డా.ఎస్.టి.శ్రీనివాస్, కె.ఎం.ఎఫ్. రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్, వివిధ మఠాధీశులు, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బుల్లితెర హాస్య కళాకారులు వాణి గౌడ, అప్పణ్ణ రామదుర్గ నిర్వహించిన హాస్య ప్రదర్శన ఆకట్టుకుంది.



సాధకులకు సత్కారం చేస్తూ..



శిష్యవేతనం అందుకున్న విద్యార్థులు

వసతి నిలయాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

రాయచూరు: వృత్తిపర, స్నాతకోత్తర కోర్సులు అభ్యసిస్తున్న వెనుకబడిన వర్గాల విద్యార్థులు రాయచూరు తాలూకాలోని మెట్రిక్ తర్వాత బాలుర, బాలికల వసతి నిలయాల్లో ప్రవేశం పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. అక్టోబరు 30 లోపు https:///shp.karnataka.gov.in/bcwd వెబ్‌సైట్‌కు పంపుకోవాలని బీసీ సంక్షేమశాఖ అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. పూర్తి వివరాల కోసం https:///bcwd.karnataka.gov.in చూడాలని కోరారు. దరఖాస్తు వేళ సాంకేతిక సమస్యలు తలెత్తితే జిల్లా, తాలూకా కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు.

కిత్తూరు రాణి చెన్నమ్మ జయంతి నిర్వహణపై సమీక్ష



మాట్లాడుతున్న ఏసీ ప్రమోద్‌కుమార్, చిత్రంలో అధికారి నాగరాజ

బళ్లారి: జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ నెల 23న కిత్తూరు రాణి చెన్నమ్మ జయంతిని ఆర్భాటంగా నిర్వహించడానికి ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని బళ్లారి ఉప విభాగం అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం నూతన జిల్లా పాలనాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మొదట ఏసీ సమావేశానికి హాజరైన సభ్యుల నుంచి వివరాలు, సలహాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ 23న ఉదయం 11గంటలకు జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 10గంటలకు కిత్తూరు రాణి చెన్నమ్మ చిత్ర పటం ఊరేగింపు ఉంటుందన్నారు. రంగమందిరంలో తాగునీటి వ్యవస్థ, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని పాలికె అధికారులకు సూచించారు. కిత్తూరు రాణి చెన్నమ్మ చరిత్రపై ప్రత్యేక ఉపన్యాసం ఉండే విధంగా చూడాలన్నారు. కన్నడ సాంస్కృతిక శాఖాధికారి నాగరాజ, వివిధ సంఘాలు సభ్యులు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కళలను ఆదరించాలి

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: కళలను ఆదరించేలా కళాకారులను ప్రోత్సహించాలని నగర శాసనసభ్యుడు నారా భరత్ రెడ్డి పేర్కొన్నారు. విద్యానగర్‌లో ప్రవాసాంధ్రులు నిర్మించిన అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మన సంప్రదాయ కళలను కాపాడుకోవాలన్నారు. నృత్య ప్రదర్శన చేసిన కళాంజలి ట్రస్ట్ కళాకారులను అభినందించారు. ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. భరత్‌ను ఆలయకమిటీ సభ్యులు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు భాస్కర్ నాయుడు, బోయపాటి విష్ణు, రవిచంద్ర, రాజేశ్వరీ, కొండయ్య, మోహన్ దాస్, శ్రీజారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న కళాకారులు



కళాకారులను అభినందిస్తున్న నగర శాసనసభ్యుడు నారాభరత్‌రెడ్డి, నాయకులు విష్ణు, రాజేశ్వరీ, రవిచంద్ర, భాస్కర్‌నాయుడు తదితరులు

కన్నడ జ్యోతి రథోత్సవం విజయవంతానికి పిలుపు



సమావేశానికి హాజరైన కన్నడపర సంఘాల సభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనంలో భాగంగా కన్నడ జ్యోతి రథయాత్ర ఈ నెల 19 నుంచి రెండు రోజులపాటు బళ్లారి జిల్లాలో పర్యటించనుంది. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని బళ్లారి ఉప విభాగం అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అధికారులకు సూచించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మంగళవారం నూతన జిల్లా పాలనాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షలో ఏసీ మాట్లాడుతూ ఈ నెల 19న రథయాత్ర సిరుగుప్ప తాలూకాలకు చేరుకుంటుందన్నారు. తాలూకాలోకి ప్రవేశించగానే తాలూకా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు స్వాగతం పలుకుతారని తెలిపారు. జిల్లాలో సిరుగుప్ప నుంచి ప్రారంభమైన కన్నడ జ్యోతి రథయాత్ర కురుగోడు తాలూకాకు చేరుకుంటుంది, అక్కడి నుంచి బళ్లారి, సండూరు, కంప్లి నుంచి విజయనగర జిల్లాలోకి ప్రవేశిస్తుందని వివరించారు. తాలూకా యంత్రాంగం, జిల్లా సాహిత్య పరిషత్, కన్నడ పర సంఘాలు సభ్యులు, పాఠశాల, కళాశాల విద్యార్థులు, ప్రధాన ఆచార్యులు వివిధ సంస్థ కన్నడ జ్యోతి రథయాత్ర విజయవంతం చేయాలని కోరారు. కన్నడ సంస్కృతి శాఖాధికారి నాగరాజ, తహసీల్దార్ గౌసియా, వివిధ సంఘ సంస్థల సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ అయిన అధికారికి వీడ్కోలు



బదిలీ అయిన అధికారిని సత్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు తదితరులు

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌గా, ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న మహంతేశ్ హరిహరకు బదిలీ అయ్యారు. 2006 నుంచి ఇక్కడ సేవలు అందించిన ఆయనకు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు మంగళవారం సత్కరించి వీడ్కోలు పలికారు. గ్రేడ్ -2 తహసీల్దార్ ఎం.ఆర్.షణ్ముఖ మాట్లాడుతూ ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించి ప్రజలకు సరైన సేవలు అందించి పేరు తెచ్చుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రవీంద్రకుమార్, ఉద్యోగులు, కర్ణాటక రాజ్య అస్పృశ్యతా విమోచనా సమితి సభ్యులు పాల్గొన్నారు.

సేవాభావం పెంపొందించే ఎన్‌ఎస్‌ఎస్



శ్రమదానంలో పాల్గొన్న విద్యార్థులు

రాయచూరు, న్యూస్‌టుడే : సేవా భావం, నాయకత్వ లక్షణాలు పెంపొందించే ఎన్‌ఎస్‌ఎస్‌లో విద్యార్థులు చేరాలని రాయచూరు విశ్వవిద్యాలయం మూల్యాంకనం రిజిస్ట్రార్ ఆచార్య ఎర్రిస్వామి కోరారు. ఈ ఉద్దేశంతోనే ప్రభుత్వం ప్రతి పాఠశాల, కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం నెలకొల్పడాన్ని తప్పని సరి చేసిందని తెలిపారు. విశ్వ విద్యాలయం పరిధిలోని కృష్ణతుంగా ఆవరణలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఎర్రిస్వామి మాట్లాడుతూ స్వచ్ఛత, పచ్చదనం ప్రయోజనాల గురించి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. ఆరోగ్య సంరక్షణకు ఇళ్లు, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడం, పర్యావరణ పరిరక్షణకు మొక్కలను పోషించడం, ప్లాస్టిక్ వస్తువులను త్యజించేలా అవగాహన కల్పించాలన్నారు. కేవలం పరిశుభ్రతా కార్యక్రమాలకు పరిమితం కాకుండా, గ్రామాలు, పట్టణాల్లోని పేదల బస్తీల్లో తరచూ ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. దేశసేవకు మించిన సేవ లేదన్న భావనతో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సహ అధ్యాపకులు వెంకటేష్, లతా, డాక్టర్ మంజునాథ్, విద్యార్థుల సంక్షేమ, కార్యక్రమాల అధికారి డాక్టర్ జి.ఎస్.బిరాదార్, నాగవేణి, విజయసరోదా, శివరాజ్ హరవి పాల్గొన్నారు.

ముస్లింల భారీ నిరసన ప్రదర్శన



నిరసన ప్రదర్శనలో ముస్లింలు

మాన్వి, న్యూస్‌టుడే : ఉత్తరప్రదేశ్‌లోని గజియాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో నరసింహ సరస్వతి అనే ధార్మిక ప్రముఖుడు మహమ్మద్ ప్రవక్తను నీచ పదాలతో హేళన చేయడాన్ని నిరసిస్తూ స్థానిక ముస్లింలు పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. సమాజం, సముదాయాన్ని కించపర్చే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ముస్లిం మత పెద్ద సయ్యద్ జజ్జాద్ హుసేని మత్వాలే డిమాండ్ చేశారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలతో సమాజంలో అశాంతి నెలకొంటుందన్నారు. నరసింహసరస్వతిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక టిప్పుసుల్తాన్ కూడలి నుంచి ఐబీ, అంబేడ్కర్ కూడలి, బసవ కూడలి మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్లకార్డులు ప్రదర్శించారు. వినతి పత్రాన్ని తహసీల్దార్ రాజు ఫిరంగికి అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ముఫ్తీ హసన్ జిశాన్ ఖాద్రి, అక్బర్ పాషా, సాధిక్‌పాషా, ఖాలిద్ ఖాద్రిగురు, సయ్యద్ హుసేన్, నజరుద్దీన్‌ఖాద్రి, సిరాజుద్దీన్‌ఖాద్రి, శేక్‌ఫరీద్ ఉమ్రి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఆర్టీవో తనిఖీ కేంద్రంపై లోకాయుక్త దాడి

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి తాలూకా హగరి సమీపంలో ఉన్న ఆర్టీవో తనిఖీ కేంద్రంలో లోకాయుక్త అధికారులు సోదాలు చేశారు. పత్రాలు లేని నగదును స్వాధీనం చేసుకున్నారు. హగరి సమీపంలోని గేడేహాళ్ వద్ద ఆర్టీవో తనిఖీ కేంద్రం ఉంది. ఇక్కడ ఇష్టారాజ్యంగా అక్రమంగా నగదును వసూలు చేస్తున్నట్లు పలు ఫిర్యాదులు అందాయి. ఈ రహదారిపై కర్ణాటక-ఆంధ్రప్రదేశ్‌కు పలు వాణిజ్య వాహనాలు రాత్రి పూట సంచరిస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో బళ్లారి లోకాయుక్త ఎస్పీ సిద్ధరాజు నేతృత్వంలో లోకాయుక్త అధికారులు సోమవారం రాత్రి 2.30 గంటల సమయంలో తనిఖీ కేంద్రంపై ఆకస్మికంగా దాడి చేశారు. పత్రాలు లేని రూ.41,700 నగదును స్వాధీనం చేసుకున్నారు. లోకాయుక్త అధికారులు దాడి చేసిన తక్షణమే కొంత నగదును కిటికీల్లో బయటకు విసిరారు. బయట ఉన్న సిబ్బంది తీసుకుని వెళ్లినట్లు లోకాయుక్త అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అరెస్టు చేయాలని ఆదేశాలు వస్తే విధుల్లో ఉన్న సిబ్బంది, అధికారులను అరెస్టు చేస్తామన్నారు. దాడిలో డీఎస్పీ వసంతకుమార్, సీఐ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

'అక్రమాలపై విచారణ చేయాలి'

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు తాలూకా మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధి గిల్లేసూగూరులోని శిశు యోజనాభివృద్ధి కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై దర్యాప్తు జరిపించాలని 'కర్ణాటక రైతు సంఘం, హసిరు సేన' జిల్లా పాలనాధికారి నితీష్‌కు మనవి చేసింది. జిల్లా కార్యాధ్యక్షుడు మంజునాథ్ నాయకత్వంలో ప్రతినిధులు మంగళవారం అధికారికి వినతి పత్రం ఇచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తలుగా అర్హులను కాకుండా అనర్హులను నియమించుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. చిక్కసూగూరు అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో తప్పుడు కుల ధృవీకరణ పత్రంతో ఉద్యోగంలో చేరిన ఒక కార్యకర్త లక్షలాది రూపాయల ఆస్తులను అక్రమంగా కూడబెట్టారని ఆరోపించారు. ఆ వివరాలను అధికారులకు అందచేసినా చర్య తీసుకోకపోవటానికి కారణం ఏమిటో అంతుచిక్కలేదన్నారు. జిల్లాలో ఏడు తాలూకాల్లోని శిశు యోజనాభివృద్ధి కార్యాలయాల్లో అవినీతి పరాకాష్ఠకు చేరుకుందన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. వీటిపై కూడా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

కనుల పండువగా బన్నిమాంకాళమ్మ వార్షికోత్సవం



చేనేత సొసైటీ కాలనీలో బన్నిమాంకాళమ్మకు పూజలు చేస్తున్న కాలనీ వాసులు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: చేనేత సొసైటీ కాలనీలోని బన్నిమాంకాళమ్మ అమ్మవారి 11వ రాత్రి వార్షికోత్సవాలు వైభవంగా జరిపారు. అమ్మవారికి నిత్యకైంకర్యాలు చేపట్టారు. ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. సహస్రకుంకుమార్చన, లలిత సహస్రనామ పఠనం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రముఖులు రంగస్వామి, కె.ఎన్.రాజ, గోపాల్, వీరేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

వైభవంగా మారికాంబాదేవి ఉత్సవం

మాన్వి, న్యూస్‌టుడే : రాయచూరు గ్రామీణ పరిధిలోని మమదాపూర్‌లో మారికాంబాదేవి ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో వివిధ ధార్మిక కార్యక్రమాలు, సాధకులకు సన్మానం జరిగింది. దేవస్థానం సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవంలో రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పక్షి ప్రేమికుడు సల్లాఉద్దీన్, వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన ప్రముఖులను సత్కరించారు.




సాధకులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్




దేవమ్మ దేవి కుంభోత్సవం

భక్తిశ్రద్ధలతో కుంభోత్సవం

కారటగి, న్యూస్‌టుడే: కారటగి గ్రామ దేవత దేవమ్మ దేవి కుంభోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. 31వ నంబరు తుంగభద్ర వితరణ కాలువలో గంగపూజ నిర్వహించారు. మహిళలు అక్కడినుంచి ఊరేగింపుగా గంగా జలం తెచ్చి దేవిని అభిషేకించారు. కుంకుమార్చన, ఒడి నింపు కార్యక్రమం జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గోమతి చక్ర అలంకారంలో బనశంకరిదేవి



వాంఛా కల్పలతా గణపతి అలంకారంలో శాకంబరి

మహంకాళి మాత విశ్వరూపం!

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : చంద్రహాసోజ్వల కరా.. శార్దూల వరవాహనా.. కాత్యాయని శుభందద్యాత్ దానవఘాతిని!.. చంద్రహాస అనే ఉజ్వల మెరుపు కత్తితో రాక్షసమూకను చెండాడిన సింహవాహని కాత్యాయనీ.. శుభాలను కలిగించు తల్లీ.. అంటూ భక్తులు వేనోళ్లా మొక్కుకున్నారు. శరన్నవరాత్రి ఆరోరోజు.. శుభమంగళవారం మాత కాత్యాయని అవతారంలో దర్శనమిచ్చి వరాలను ప్రసాదిస్తోందని భక్తుల విశ్వాసం. కాత్యాయని మాత ఎంత శాంతమో దుష్టసంహారంలో అంతకుమించి రౌద్రదేవి. భక్తిగా వేడుకునే వారి కొంగు బంగారంచేసే ఆ మాతకు మంగళవారం ఆలయాలలో నిర్వహించిన అలంకారాలూ ఎంతో మహదానందాన్ని కలిగించాయి. బెంగళూరులోని బనశంకరి మాత ఆలయంలో గోమతి చక్ర అలంకారంలో భక్తులకు సంతోషయుక్తంగా అమ్మవారు దర్శనమిచ్చారు. అదే ఆలయంలోని శాకంబరిదేవి.. వాంఛా కల్పలతా గణపతి రూపంలో కీర్తనలు అందుకుంది. మహంకాళి ఆలయంలో స్కందమాతగా తన కుమారుణ్ని ఒడిలో కూర్చోపెట్టుకుని చిరునవ్వులు ఒలకబోస్తుండగా.. భవానీ మాత శ్రీమహాలక్ష్మి రూపంలో తనని చూడవచ్చిన భక్తులను మెప్పించారు. హొరనాడు ఆదిశక్త్యాత్మక అన్నపూర్ణాదేవినీ కాత్యాయని రూపంలో అలంకరించారు. బెంగళూరు బ్యాంక్‌కాలనీలో ప్రసన్నపార్వతికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవార శుభదినాన కుంకుమార్చనలు, లలితాసహస్ర నామార్చనలు, సుమంగళుల పూజలు ఘనంగా కొనసాగాయి.



గవిగంగాధరేశ్వరుడి అర్ధనారీశ్వరి



త్రిశూలధారిణి మహాకాళి



స్కందమాతగా దర్శనమిచ్చిన మహంకాళి

రారండోయ్.. సందడి చేద్దాం!



డ్రోన్ల వెలుగులో.. గర్జిస్తున్న సింహం

రాచనగరికి దసరా హంగులు

మైసూరు, న్యూస్‌టుడే : కన్నడిగులకే ప్రత్యేకంగా విరాజిల్లే మైసూరు దసరా వేడుకల వీక్షణకు దేశ, విదేశీ పర్యాటకులు వరుసగా కదలివస్తున్నారు. వీరి రాకతో రాచనగరి వీధులు సందడిగా మారుతున్నాయి. వచ్చే వారిని ఆకట్టుకునే అంశాలకు ఈసారి కొదవేలేదు. వివిధ ప్రదర్శనశాలలు, వస్తు సంగ్రహాలయాలు.. అన్నింటికీ మించి ప్యాలెస్ వైభవం చూడటానికి రెండు కళ్లు చాలడం లేదు. ఆహార మేళాలో భాగంగా ఆదివాసీలు ఏర్పాటు చేసిన స్టాల్‌కు చక్కని స్పందన లభించింది. చామరాజనగర, మైసూరు, కొడగు ప్రాంతాలకు చెందిన ఆదివాసీలు ఏర్పాటు చేసిన స్టాళ్లలో బాంబూ చికెన్‌కు ఎక్కువ డిమాండు ఏర్పడింది. వెదురు రసం, అడవి కరివేపాకు, అడవిలో లభించే నాటు పసుపు కొమ్ములు, కొండల్లో సాగు చేసిన బియ్యం, నాటు కోళ్లతో బిర్యానీని తయారు చేస్తున్నామని ఒక స్టాల్ నిర్వాహకుడు తెలిపారు. తొమ్మిదేళ్ల నుంచి ఈ బిర్యానీ స్టాల్‌ను మైసూరులో నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. ఈ ఏడాది తమ వెదురుబొంగుల చికెన్‌ను కనీసం రెండు లక్షల మందికి రుచి చూపించాలనేది లక్ష్యమని తెలిపారు. ఆహార మేళా కోసం నిర్వహిస్తున్న స్టాళ్లలో తేనె, వన ఉత్పత్తులు, మైసూరు చుట్టుపక్కల లభించే మల్లిగె ఇడ్లి, నంజనగూడు రసబాళె (అరటి)తో చేసిన పండ్ల రసాలు, తమలపాకులు, మల్లెపూలను కొన్ని స్టాళ్ల వద్ద విక్రయించారు. దసరా ఉత్సవాల్లో చివరి ఘట్టం జంబూ సవారీలో పాల్గొనే తొమ్మిది ఏనుగులతో పాటు మైసూరులో తాలీములో పాల్గొన్న అన్ని ఏనుగులకు చివరి విడత బరువును నిపుణులు సోమ, మంగళవారాల్లో పరిశీలించారు.

గజభారం..

● దసరా ఉత్సవాల్లో చివరి ఘట్టం జంబూ సవారీలో పాల్గొనే తొమ్మిది ఏనుగులతో పాటు మైసూరులో తాలీములో పాల్గొన్న అన్ని ఏనుగులకూ చివరి విడత బరువును సోమ, మంగళవారాల్లో సరిచూశారు. ఏనుగులు- నగరానికి వచ్చినప్పుడు బరువు (కిలోలు)- ప్రస్తుత బరువు వివరాలు.. అభిమన్యు (పూర్వం 5560- ప్రస్తుతం 5820), భీమ (4945- 5545), ఏకలవ్య (4730- 5380), కంజన్ (4515- 5280), ధనుంజయ (5155- 5255), లక్ష్మి (2480- 2625), వరలక్ష్మి (3495- 5150), రోహిత (3625- 5095), గోపి (4970- 4725), ప్రశాంత (4875- 3930), హిరణ్య (2930- 3570), మహేంద్ర (4910- 3555), సుగ్రీవ (5190- 3160), దొడ్డ హరవె లక్ష్మి (3484-2625) బరువు తూగాయి. ప్రశాంత, మహేంద్ర, సుగ్రీవ, దొడ్డ హరవె లక్ష్మి భారీగా బరువు తగ్గాయని అధికారులు తెలిపారు. సుమారు 750 కిలోల బంగారు అంబారీలో అమ్మవారి విగ్రహాన్ని మోసే అభిమన్యు వీపుపై వేసేందుకు ప్రత్యేకంగా నమ్దా (వీపుపై ఒత్తిడి లేకుండా వేసే మెత్తని పరుపు)ను నిపుణులు తయారు చేశారు.



జంబూసవారీలో పాల్గొనే ఏనుగు తూకం పరిశీలిస్తున్న అధికారులు

రైతు దసరాలో సరదా పోటీలు

మైసూరు, న్యూస్‌టుడే : మైసూరు 'రైతు దసరా'లో సరదా పోటీలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేక వేదికపై మంగళవారం పాలుపిండే పోటీలకు చక్కని స్పందన లభించింది. ఆనేకల్ తాలూకా కగ్గలిపుర తనీష్ ఫారం నుంచి తీసుకుని వచ్చిన ఆవు నుంచి ఉదయం, సాయంత్రం కలిపి 42.840 లీటర్ల పాలు పిండి దాని యజమాని రామచంద్రరెడ్డి రూ.లక్ష బహుమతి అందుకున్నారు. ఆ ఆవును నిర్వాహకులు సత్కరించారు. ఒక్కో పోటీదారునికి 20 నిమిషాల సమయం ఇచ్చారు. చెన్నరాయపట్టణ తాలూకా తోట గ్రామానికి చెందిన రేవణ్ణ ఉదయం, సాయంత్రం 42.300 లీటర్లు పిండి రూ.80 వేల బహుమతి అందుకున్నారు. ఆనేకల్ తాలూకా దొమ్మసంద్రకు చెందిన అజయ్‌రెడ్డి రూ.41.300 లీటర్లను పిండి రూ.60 వేలను, హెచ్‌డీకోటె తాలూకా కణియనహుండికి చెందిన ఏజీఎం ఫారం యజమాని దేవరాజ్ 40.580 లీటర్ల పాలు పిండి, రూ.40 వేలతో నాల్గవ బహుమతి అందుకున్నారు. వీరికి నగదు ప్రోత్సాహకంతో పాటు పాల క్యాను, ప్రశంసా పత్రం, ట్రోఫీ అందించి.. మైసూరు తలపాగాలతో సత్కరించారు.



పోటీలో ఉత్సాహంగా పాలు పిండుతున్న రైతన్న



ఎక్కువ పాలు ఇస్తున్న ఆవును సత్కరిస్తున్న నిర్వాహకులు



వేగంగా పాలు పిండి సత్కారం అందుకున్న రైతులతో నిర్వాహకులు



సరస్వతి రూపంలో అమ్మవారు

కుద్రోళి వేడుక భళి!

ఆకట్టుకుంటున్న విగ్రహాలు

మంగళూరు, న్యూస్‌టుడే : కుద్రోళి దేవాలయంలో శారదామాత విగ్రహంతో పాటు సిద్ధిధాత్రి, మహాగౌరి, మహాకాళి, కాత్యాయిని, స్కందమాత, చంద్రఘంటా, బ్రహ్మచారిణి, శైలపుత్రి, ఆదిశక్తి విగ్రహాలను ప్రతిష్ఠాపించారు. ఈ ఆలయంలో మాజీ మంత్రి జనార్దన పూజారి మొదటిసారిగా 34 ఏళ్ల కిందట దసరా ఉత్సవాలను ప్రారంభించారు. అప్పటి నుంచి ఏటా ఉత్సవాల నిర్వహణకు ఆయనే నేతృత్వం వహిస్తున్నారు. కుద్రోళి గోకర్ణనాథుని ఆలయంలో వరుసగా నవ దుర్గలను ఆరాధించడం ఇక్కడి దసరా వేడుకల ప్రత్యేకత. ఈ విగ్రహాలను కుబేర అనే కళాకారుడు తన శిష్య బృందంతో తయారు చేయించారని ఆలయ సమితి కోశాధికారి పద్మరాజ పూజారి తెలిపారు. ముల్కికి చెందిన చంద్రశేఖర సువర్ణ అనే కళాకారుడు ఈ విగ్రహాలను ప్రతిష్ఠాపించేందుకు మండపాలను నిర్మించారు. విజయదశమి రోజు ఈ విగ్రహాలను నగరంలో ఊరేగించి నిమజ్జనం చేస్తామని చెప్పారు.



వివిధ రూపాలలో దేవతామూర్తులు



బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

- బీన్స్- 90
- క్యారెట్- 65
- బీరకాయలు- 40
- క్యాబేజి- 20
- కాలీఫ్లవర్ (ఒక్కోటి)- 25
- సొరకాయ- 30
- దొండకాయలు- 28
- పొట్లకాయ- 35
- టమాటా(నాటు)- 80
- టమాటా (సాధారణ)- 65
- గుమ్మడి- 40
- ఆలుగడ్డ- 45
- ఉల్లిగడ్డలు(మేలురకం)- 70
- ఉల్లిగడ్డలు(సాధారణ)- 50
- వెల్లుల్లి - 390
- సాంబారు ఉల్లి- 95
- బీట్‌రూట్- 25
- వంకాయలు- 35

ఉద్యాననగరి వైభవం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బెంగళూరులోనూ దసరా వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. బెంగాలీ సంఘాల ప్రతినిధులు తమ నివాసాలు, అపార్ట్‌మెంట్ సముదాయాల్లో దుర్గామాత విగ్రహాలను ఏర్పాటుచేసి, విజయదశమి నాడు పూజలు చేసేందుకు సిద్ధమయ్యారు. కొన్ని సంఘాల ప్రతినిధులు భారీ విగ్రహాలను తయారు చేయించుకున్నారు. విజయదశమి నుంచి వారం పాటు విగ్రహాలను నిమమజ్జనం చేసేందుకు హలసూరు, స్యాంకీ చెరువుల్లో ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. చిక్కపేట ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్, మేధిని గరుడాచార్ తమ నివాసంలో ఏర్పాటుచేసిన బొమ్మలకొలువు విశేషంగా ఆకట్టుకుంటోంది. కొన్నేళ్లుగా తాము సేకరించిన బొమ్మలను ఈ కొలువులో ఉంచుతూ, పూజలు చేసుకుంటున్నానని మేధిని గుర్తు చేశారు. పాఠశాలలకు సెలవు ఇవ్వడంతో తమ పిల్లలతో కలిసి సొంత ఊళ్లకు ఎక్కువ మంది తరలి వెళ్లారు. గురువారం నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు కేఎస్ఆర్టీసీ, ఏపీఎస్ఆర్టీసీ బెంగళూరు నుంచి అదనపు బస్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి.



విక్రయానికి సిద్ధంగా ఉన్న దుర్గామాత విగ్రహాలు



ఓ నివాసంలో ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు

గాలి జనార్దన్‌రెడ్డి వాహనాల స్వాధీనం

గంగావతి,న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కాన్వాయ్ వెళ్తున్న సమయంలో జీరో ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన ఆరోపణలపై గంగావతి శాసనసభ్యుడు గాలి జనార్దన్‌రెడ్డి, ఆయన అనుచరులకు చెందిన రెండు కార్లను గంగావతి పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. సింధనూరు నుంచి గత శనివారం ముఖ్యమంత్రి కొప్పళ తాలూకా బసాపుర విమానాశ్రయానికి వెళ్తుండగా పోలీసులు జీరో ట్రాఫిక్‌ను ఏర్పాటు చేశారు. వడ్డరహట్టిలో పార్టీ కార్యక్రమంలో పాల్గొని తిరిగివస్తున్న జనార్దన్‌రెడ్డి కారును పోలీసులు అడ్డుకున్నారు. జనార్దన్‌రెడ్డి వాహనం విభాజకాన్ని దాటి ముఖ్యమంత్రి కాన్వాయ్‌కు ఎదురెళ్లింది. దీంతో గంగావతి సంచార నియంత్రణ పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు కార్లు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. దీనిపై జనార్దన్‌రెడ్డి స్పందిస్తూ జీరో ట్రాఫిక్ కోసం అరగంట ఎదురుచూసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రాక ఆలస్యం కావడంతో విభాజకాన్ని దాటి ముందుకు వెళ్లామన్నారు. బళ్లారిలో తమ కుటుంబం ఆధ్వర్యంలో జరుగుతున్న ధార్మిక కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇలా చేయాల్సి వచ్చిందన్నారు. దీనిపై జిల్లా మంత్రి శివరాజ్ తంగడిగి తనపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి కేసు నమోదు చేయాల్సిందిగా పోలీసులకు సూచించారన్నారు. పోలీసులు కేసు దాఖలు చేసినందున వాహనాలు అప్పగించినట్లు పేర్కొన్నారు.



స్వాధీనం చేసుకున్న జనార్దన్‌రెడ్డి కారుతో పోలీసులు

మార్కులు తగ్గాయని చితగ్గొట్టిన వార్డెన్

విజయపుర: గణితంలో తక్కువ మార్కులు వచ్చాయని ఒక విద్యార్థి (15)ని కోచింగ్ సెంటర్ వార్డెన్ ఇష్టం వచ్చినట్లు కొట్టాడు. ఒళ్లంతా వాతలు తేలిన విద్యార్థికి ప్రాథమిక చికిత్స అందించి, జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. విజయపుర శివార్లలోని ఇట్టంగిపాళ్య గ్రామంలో ఎక్సలెంట్ కోచింగ్ సెంటర్‌లో దావణగెరె విద్యార్థి చదువుతున్నాడు. తొడ, వెన్నుభాగంలో వాతలు తేలడంతో అతను కూర్చునేందుకూ ఇబ్బంది ఎదుర్కొన్నాడు. బాలుని తల్లిదండ్రుల ఫిర్యాదుతో కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకుడు బసవరాజ కవలగి, ఇతర సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

'దక్షిణ' బరిలో నలుగురు

మంగళూరు, న్యూస్‌టుడే : దక్షిణ కన్నడ జిల్లా స్థానిక సంస్థల నుంచి విధానపరిషత్తుకు ఈ నెల 21న జరిగే ఉప ఎన్నికల్లో నలుగురు అభ్యర్థులు బరిలో మిగిలారు. భాజపా నుంచి బీఆర్ కిశోర్, కాంగ్రెస్ అభ్యర్థిగా రాజు పూజారి, ఎస్‌డీపీఐ తరపున అన్వర్ సాదత్, స్వతంత్ర అభ్యర్థిగా దినేశ్ ఉల్లాల్ పోటీలో ఉన్నారు. మరో స్వతంత్ర అభ్యర్థి మహ్మద్ రిమాజ్ తన నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకున్నారు. ఇక్కడి నుంచి గెలుపొందిన భాజపా అభ్యర్థి కోటా శ్రీనివాస పూజారి లోక్‌సభకు ఎన్నిక కావడంతో ఇక్కడ ఉప ఎన్నికలు వచ్చాయి. ఉడుపి, దక్షిణ కన్నడ జిల్లాలలో 392 పోలింగ్ బూత్‌లలో 6037 మంది ఓటర్లు ఉన్నారు.

ఉద్యోగం పేరిట వంచన

కార్వార, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వంచనలకు పాల్పడుతున్న శ్రీధర్ కుమటాకర్ అనే వ్యక్తిని కార్వార పోలీసులు అరెస్టు చేశారు. ఉద్యోగాల పేరిట పలువురు నిరుద్యోగుల నుంచి నగదు వసూలు చేసిన నిందితుడు కొందరు ఒత్తిళ్లు తేవడంతో చెక్కులు ఇచ్చాడు. అవి బౌన్సు కావడంతో కోర్టులో కేసులు వేశారు. విచారణకు హాజరు కాకపోవడం, పలువురు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కార్యాచరణ నిర్వహించి నిందితుడ్ని అరెస్టు చేశారు.

అన్నను కడతేర్చిన తమ్ముడు

బెళగావి: భూ వివాదానికి సంబంధించి సునీల్ ఖోత్ (45) అనే వ్యక్తిని తన సహచరునితో కలిసి అనిల్ ఖోత్ అనే అతని సోదరుడే హత్య చేసినట్లు సంబంధిత పోలీసులు సోమవారం వెల్లడించారు. భూవివాదం, నడక దారి విషయంలో అన్నదమ్ముల మధ్య గత కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. తమ్మునిపై సదలగా ఠాణాలో ఫిర్యాదు చేసేందుకు వెళుతున్న సమయంలో దారి కాచి హత్య చేసి నిందితులు పరారయ్యారు.



ఎరుపు.. మెరుపు

శరన్నవరాత్రి ఉత్సవాలను ఐఐటీ (బెంగళూరు) విద్యార్థులు, బోధకులు వినూత్నంగా ఆచరించారు. అందరూ ఎరుపు వర్ణం దుస్తులు ధరించి, సంస్థకు వచ్చి మంగళవారం వేడుకలు నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ అవసరమైన సందర్భంలో దుర్గగా మారవలసిన అవసరం ఉందని ఆచార్యులు పేర్కొన్నారు. **(న్యూస్‌టుడే, సదాశివనగర)**

'అధిష్ఠానానికి అప్ప బెదిరింపులు'

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : మహిళలను లైంగిక వేధింపులకు గురిచేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ముఖ్యమంత్రి బి.ఎస్.యడియూరప్పకు వ్యతిరేకంగా భాజపా అధిష్ఠానం ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్‌గుండూరావు ప్రశ్నించారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న నృత్యదర్శకుడు జానీ మాస్టర్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పురస్కారాన్ని వెనక్కి తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. దినేశ్ మంగళవారం ఇక్కడ కాంగ్రెస్‌భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న యడియూరప్ప నేటికీ భాజపా కేంద్ర విభాగ పదవుల్లో కొనసాగుతున్నారని, ఆయనను తొలగించడం సాధ్యం కాదా? అని ప్రశ్నించారు. కేసులో సాక్ష్యాధారాలను నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర అధిష్ఠానాన్ని బెదిరింపులకు దిగడంతో హస్తిన నాయకులు ఏమీ చేయలేక పోతున్నారని ఎద్దేవా చేశారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దినేశ్‌గుండూరావు తదితరులు

ఈతకెళ్లి ముగ్గురు బాలల దుర్మరణం



వినయ్, గురు మృతదేహాల వద్ద జయణ్ణ లక్ష్మీ దంపతుల కన్నీరుమున్నీరు

హొసపేటె, న్యూస్‌టుడే: చెరువులో ఈతకెళ్లిన ముగ్గురు బాలురు అందులో మునిగి మృతి చెందిన ఘటన కూడ్లిగి తాలూకా కుమతిలో మంగళవారం జరిగింది. మృతుల్లో ఇద్దరు సోదరులు ఉన్నారు. కుమతికి చెందిన జయణ్ణ లక్ష్మీ దంపతుల కుమారులు వినయ్(14), గురు(11), సోమణ్ణ నాగమ్మ దంపతుల కుమారుడు సాగర్ (11)లు ఉదయం 11 గంటలకు గ్రామ శివారులోని చెరువులో ఈతకెళ్లారు. ఇటీవలే భారీ వర్షాలు కురిసి, చెరువు భర్తీ అయింది. లోతు తెలియని బాలురు అందులో దిగి మునిగిపోయారు. మధ్యాహ్నం ముగ్గురి మృతదేహాలు చెరువులో తేలడం చూసిన స్థానికులు బాలుర తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఉన్న ఇద్దరు కుమారులను కోల్పోవడంతో జయణ్ణ లక్ష్మీ దంపతుల రోదన మిన్నంటింది. విషయం తెలిసి ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కానాహొసహళ్లి ఠాణా పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



సాగర్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

తిమ్మక్క పేరిట ఉద్యానవనం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : యలహంక సమీపంలో 153 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్బన్ ఉద్యానవనం తరహాలో వృక్షమాత 'తిమ్మక్క' పేరిట ఉద్యానవనాన్ని అభివృద్ధి చేస్తామని అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే తెలిపారు. త్వరలో దీని నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. మల్లేశ్వరంలో అరణ్యభవన్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వన్యప్రాణుల వారోత్సవాల ముగింపు వేడుకల్లో ఆయన మాట్లాడారు. చిత్రలేఖనాలు, ఛాయాచిత్రప్రదర్శనల విజేతలకు బహుమతులు అందజేశారు. అధికారులు మంజునాథ ప్రసాద్, బ్రిజేశ్ కుమార్ దీక్షిత్, సుభాష్ మాల్పడే తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రదర్శనలో ఉంచిన చిత్రాలను వీక్షిస్తున్న ఈశ్వర ఖండ్రే

ధర్మస్థలలో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు


వాద్యకళాకారుల డోలు వాద్యం

బెంగళూరు (సాంస్కృతికం): ధర్మస్థలలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం వివిధ అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. డోలు వాద్య కళాకారులతో నగాడా డోలు వాద్య ధ్వనులు వేదఘోషలు, శంఖనాదాలు, ఓంకార ప్రణవనాదంలో భాసిల్లాయి. ఆడిటోరియంలో జరిగిన సంగీత విభావరిలో బెంగుళూరుకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి కశ్యప్ రావ్ సంగీతం వీక్షకులను ఉల్లాసపరిచింది. ధర్మాధికారి వీరేంద్రహెగ్గడే కళాకారులను అభినందించారు.

బెంగళూరు

•బెంగళూరు •హోసూరు

సిద్ధరామయ్యే కారణం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : హరియాణాలో కాంగ్రెస్ పార్టీ ఓటమికి సిద్ధరామయ్యే కారణమని మాజీ స్పీకర్ కెబి కోళివాడ ఆరోపించారు. సిద్ధరామయ్య అక్రమాలకు పాల్పడ్డారంటూ ప్రధాని మోదీ, భాజపా నాయకులు అక్కడ చేసిన ప్రచారమే కాంగ్రెస్ అభ్యర్థులను దెబ్బతీసిందన్నారు. సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేసి, విచారణను ఎదుర్కొంటే ఉత్తమం అని గతంలో తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని చెప్పారు. తన అభిప్రాయాన్ని పార్టీకి అంటగట్టవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

బెంగళూరు (శివాజీనగర): పదేళ్ల పాటు నర్సులుగా సేవలు అందిస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని జయదేవ హృద్రోగ సంస్థలో పని చేస్తున్న కొందరు నర్సులు వేసుకున్న అర్జీపై విచారణ పూర్తి చేసి జస్టిస్ ఎన్ఎస్ సంజయ్‌గౌడ మంగళవారం ఈ ఆదేశాలు ఇచ్చారు.

హోసూరు కబుర్లు

రెండు మహిళా సంఘాలకు మణిమేగలై ప్రశస్తి


ప్రశస్తిని అందుకున్న మేగనశ్రీ సంఘం సభ్యులతో కలెక్టర్


మహిళా సంఘం సభ్యులను అభినందిస్తున్న కలెక్టర్ సరయు

హోసూరు, న్యూస్‌టుడే : కృష్ణగిరి జిల్లా రాయకోటకు చెందిన హిజ్రాలు నిర్వహిస్తున్న వైగై స్వసహాయ మహిళా సంఘం సేవలను ప్రభుత్వం గుర్తించి సంఘానికి మణిమేగలై ప్రశస్తిని ప్రకటించింది. సంఘం నిర్వాహకులు కృష్ణగిరిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సరయును కలిశారు. కృష్ణగిరి మునిసిపాలిటీ పరిధి పాతపేటలోని మేగనశ్రీ మహిళా సంఘానికి ప్రభుత్వం మణిమేగలై ప్రశస్తి, ప్రశంస పత్రాన్ని అందించింది. ఉత్తమ ప్రశస్తి పొందిన రెండు సంఘాల నిర్వాహకులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అభివృద్ధి అధికారి కార్తికేయన్, జిల్లా సహాయ ప్రాజెక్ట్ అధికారులు ఎ.గణేషన్, వేల్‌మురుగన్, తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏఐఏడీఎంకే ఆందోళన


మానవహారంలో రాజ్యసభ సభ్యుడు తంబిదురై, తదితరులు

హోసూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఏఐఏడీఎంకే ఆధ్వర్యంలో నగరంలో ఆందోళన చేశారు. మంగళవారం రాయకోట రోడ్డులో రైల్వే స్టేషన్ ఎదుట, మూకండపల్లి, బాగలూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో వేలాది మంది కార్యకర్తలు నిరసన ప్రదర్శన చేశారు. పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు ఆందోళనలో పాల్గొన్నారు. మానవహారంలో వందలాది మంది పాల్గొని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. రాజ్యసభ సభ్యుడు ఎం.తంబిదురై ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మాజీ మంత్రి పి.బాలకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమ నాయకులు జయప్రకాశ్, శ్రీధర్, తేరుపేట రాజీ, వాసుదేవన్, శివరాం, ఎస్.నారాయణన్, పి.నంజుండస్వామి, జయప్రకాశ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు


ప్రత్యంగిర దేవత

హోసూరు : హోసూరు-కృష్ణగిరి రోడ్డు మోర్నపల్లి పారిశ్రామికవాడలో వెలసిన ప్రత్యంగిర దేవత ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఆలయంలో అర్ధనారీశ్వర అలంకారం, కాత్యాయని అలంకారం, రాజరాజేశ్వరి అలంకారాలతో పూజలు వైభవంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

ముత్యాల ఆభరణాల విక్రయాలు

బెంగళూరు (మల్లేశ్వరం): హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ముత్యాల ఆభరణాల సంస్థ జగదాంబ పెరల్స్ ఫోరం సౌత్ మాల్‌లో తన రిటైల్ స్టోరు, కియోస్క్‌ను ప్రారంభించింది. ముత్యాల వ్యాపారంలో వందేళ్ల అనుభవం ఉన్న తాము 50 ఏళ్లుగా దుకాణం ద్వారా విక్రయాలు చేస్తూ వస్తున్నామని కియోస్క్‌ను ప్రారంభించిన సంస్థ యాజమాన్య ప్రతినిధులు అవినాశ్ అగర్వాల్, యశ్ అగర్వాల్ తెలిపారు. కియోస్క్, వెబ్‌సైటు ద్వారా ముత్యాలు, ఆభరణాలను కొనుగోలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. త్వరలో బెంగళూరు, కేరళలో కొత్త స్టోర్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

పెరుగుతున్న ఉద్యోగ నియామకాలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : బెంగళూరు నగరంతో పాటు దేశంలోని వివిధ నగరాల్లో ఉద్యోగ నియామకాల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే 20 శాతం పెరిగినట్లు ఇండీడ్ సంస్థ సర్వేలో వెల్లడైంది. డెలివరీ, వేర్‌హౌస్ లాజిస్టిక్ రంగాల్లో నియామకాలు గణనీయంగా పెరిగాయి. ఉద్యోగ నియామకాలపై ఆసంస్థ నిర్వహించిన సర్వే నివేదికను ఇక్కడ విడుదల చేసింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా డెలివరీ రంగంలో 30 శాతం ఉద్యోగావకాశాలు పెరిగినట్లు సంస్థ సంచాలకుడు శశికుమార్ తెలిపారు. మొదటి తరగతి నగరాల్లో 20 శాతం, రెండు, మూడో తరగతి నగరాల్లో 25 నుంచి 28 శాతం ఎక్కువగా పెరిగినట్లు తెలిపారు. బెంగళూరు నగరంలో ఆరంగాల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి నిరుద్యోగ యువత ఎక్కువ సంఖ్యలో నగరానికి వస్తున్నట్లు తమ సర్వేలో వెల్లడైనట్లు వివరించారు.

అమెజాన్‌లో దుర్గపూజ సామగ్రి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : దసరా పండగ సందర్భంగా అమెజాన్ గ్రేట్ ఇండియా ఫెస్టివల్-2024 దుర్గాపూజ సామగ్రి వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది. పండగకు సంబంధించిన 25 వేల నూతన ఉత్పత్తులను అమెజాన్ ఇన్‌లో పొందవచ్చని, దుస్తులు, పూజ సామాగ్రి, ఎలక్ట్రానిక్ వస్తువులను అందుబాటులో ఉన్నాయని సంస్థ ఒక ప్రకటనలో తెలియజేసింది. పండగ సందర్భంగా అందుబాటులోకి తెచ్చిన వస్తువులను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన


సమావేశంలో రైతు సంఘం నాయకులు, రైతులు

పావగడ, న్యూస్‌టుడే : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, హసిరు సేన జిల్లా అధ్యక్షుడు పూజారప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన పట్టణంలోని విశ్రాంతి భవనంలో జరిగిన రైతుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల కాలంలో జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు పంటలు పూర్తిగా నష్టపోయి రైతులు దిక్కుతోచని పరిస్థితిలో అప్పులు తీర్చలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నష్టపోయిన రైతులను గుర్తించి పంట నష్ట పరిహారాన్ని వెంటనే అందచేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. రైతు సమస్యలపై ఈ నెల 22న తుమకూరు జిల్లాధికారి కార్యాలయం ముందు చేపట్టే ధర్నాకు తాలూకా నుంచి అధిక సంఖ్యలో రైతులు తరలి రావాలని పూజారప్ప పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రామాంజినేయులు, తాలూకా కార్యదర్శి నరసణ్ణ, సహ కార్యదర్శి చిత్తయ్య, నాగేంద్రప్ప, వీరభద్రప్ప, శ్రీరామప్ప, క్రిష్ణప్ప, రమేశ్, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

పూడిక తొలగింపు పనులు షురూ

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగరంలో ఓవైపు వర్షం కురుస్తుండగా మరో వైపు రహదారి పక్కన ఉన్న వాననీటి కాలువల్లో పూడిక తొలగింపు పనులను పాలికె చేపట్టింది. వాననీరు రహదారుల్లో నిలబడిన ప్రాంతాల్లో పూడిక తొలగిస్తున్నారు. పూడిక తొలగించి పక్కన వేయడం వల్ల వర్షం కురిస్తే మళ్లీ మట్టి కాలువల్లోకి జారి పోతోంది. వర్షం వచ్చిన ప్రతిసారీ పూడిక తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మట్టి తొలగించి తరలించడానికి వాహనాలు సిద్ధంగా ఉన్నా కార్మికులు దొరకడం లేదు. దసరా పండగ రావడంతో కార్మికులు సొంత ఊర్లకు వెళ్లారు. దీంతో బురద, మట్టి తరలింపు నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. వర్షాలు రాక ముందు కాలువల్లో పూడిక తొలగించడం అనవాయితీ. ఆవిషయాన్ని మరిచిన అధికారులు వర్షం కురిసేటప్పుడు పూడిక తొలగింపు పనులు చేపట్టారు. లోతట్టు ప్రదేశాలతో పాటు వాననీరు ఎక్కువగా నిలబడిన ప్రదేశాల్లో కాలువల్లో పూడిక తొలగింపు పనులు ప్రారంభించారు. వైట్‌ఫీల్డ్, మారతహళ్లి, కుందనహళ్లి, బెళ్లందూరు, సర్జాపుర, కోరమంగల, మడివాళ, బీటీఎం లేఔట్, సిల్క్‌బోర్డు, బొమ్మనహళ్లి, సోమసుందరపాళ్య, ఆగర తదితర ప్రాంతాల్లో వాననీటి కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.


వైట్‌ఫీల్డ్‌లో కాలువలో తొలగించిన పూడిక


కాలువపై బండలు తొలగింపు

శాస్త్రీయ పద్ధతుల్లో చెత్త నిర్మూలన


శాస్త్రీయ పద్ధతుల్లో నిర్మించిన చెత్త నిర్మూలన కేంద్రం

బెంగళూరు (యశ్వంతపుర) : నగరాన్ని పట్టిపీడిస్తున్న చెత్త నిర్మూలన కోసం కోరమంగలలో శాస్త్రీయ పద్ధతుల్లో నిర్మించిన ఓ కేంద్రం విజయవంతమైనట్లు అధికారులు ప్రకటించారు. నిత్యం 150 నుంచి 160 టన్నుల చెత్తను ఆకేంద్రంలో నిర్మూలించవచ్చన్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రం పని చేస్తుంది. ఇక్కడి నుంచి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకున్నారు. వచ్చిన చెత్తను ఎండు, పచ్చిగా విభజిస్తారు. పచ్చిచెత్తను గ్యాస్ ఆధారిత విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలకు పంపిస్తారు. సాధ్యం కాకపోతే ఆచెత్తను ఎరువుగా మార్చి రైతులకు సరఫరా చేస్తారు. ప్రస్తుతం ఆ కేంద్రానికి బీటీఎం లేఔట్ మూడు వార్డులు, శాంతినగరలోని మూడు వార్డుల నుంచి సేకరించిన చెత్తను తరలిస్తున్నారు. కేంద్రంలోకి నేరుగా ఆటో టిప్పర్లు, కంటైనర్లు సంచరించే విధంగా మార్గాన్ని నిర్మించారు.


చెత్తను విభజిస్తున్న కార్మికులు

నగరంలో ఈనాడు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే :

- ఉదయం 9 గంటలకు మల్లేశ్వరం సర్కిల్ మారెమ్మ దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.
- ఉదయం 9 గంటలకు యశ్వంతపురలోని గాయత్రీ దేవస్థానంలో నవరాత్రి పూజలు, ప్రసాదం పంపిణీ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.
- ఉదయం 10 గంటల నుంచి హోటల్ అశోక్‌లో హైలైఫ్ వస్త్రాలు, హస్తకళా వస్తు ప్రదర్శన కొనసాగుతుంది.
- మధ్యాహ్నం 3.30 గంటలకు హెచ్ఏఎల్ ఆవరణలోని విజయకుమార్ సమావేశమందిరంలో హెచ్ఏఎల్ కేంద్రీయ కన్నడ సంఘం కన్నడ సంరక్షణ కోసం మాసద మాతు కార్యక్రమాన్ని కర్ణాటక సంస్కృత విశ్వ విద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య మల్లేపురం జి.వెంకటేశ్ ప్రారంభిస్తారు.


అశోక్ దంపతులను సత్కరిస్తున్న మహిళలు

అశోక్ సేవలు అభినందనీయం

బెంగళూరు (జాలహళ్లి) న్యూస్‌టుడే : 45 ఏళ్లుగా విద్యా సంస్థలు, కేబీసీ ట్రస్టు ద్వారా వందలాది మందికి సేవలందిస్తున్న మాజీ సీఎంసీ అధ్యక్షుడు కె.సి. అశోక్ సేవలు అభినందనీయమని మహిళా సంఘం అధ్యక్షురాలు అను పేర్కొన్నారు. మంగళవారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో అశోక్ దంపతులను సన్మానించారు. వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓవర్‌ఆల్ ఛాంపియన్స్ ఆళ్వాస్ క్రీడాకారులు


బంగారు పతకంతో కబడ్డీ ఛాంపియన్స్

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : యువ సబలీకరణ, క్రీడాశాఖ ఆధ్వర్యంలో మైసూరు చాముండీ విహార్ క్రీడాప్రాంగణంలో జరిగిన రాష్ట్ర స్థాయి దసరా క్రీడాపోటీల్లో ఆళ్వాస్ బృందం ఆధిపత్యం సాధించడం హర్షణీయమని ఆళ్వాస్ విద్యాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎం.మోహన్‌ఆళ్వా అభినందించారు. కబడ్డీ పురుషుల విభాగంలో బంగారు పతకం, మహిళల విభాగంలో రజతపతకంతో రెండో స్థానాన్ని చేపట్టారు. అథ్లెటిక్స్ పురుషుల, మహిళల విభాగాల్లో ఎనిమిది బంగారు, ఆరు రజత, ఐదు కాంస్యలతో 19 పతకాలను సొంతం చేసుకొంది. వెయిట్ లిఫ్టింగ్‌లో నాలుగు బంగారు, ఏడు రజత, పదకొండు కాంస్య పతకాలను సాధించారు. ప్రశాంత్, శివానంద, జేమ్స్ అగ్రస్థానాలు చేపట్టారు. నాగరాజ, అమీర్, సంతోష్, దర్శన్, ప్రత్యూష్ రెండో స్థానంలో నిలిచారు. కుస్తీలో రజత పతకంతో పాటు ఐదు కాంస్య పతకాలు దక్కించుకున్నారు.

అర్జున్‌కప్ పోటీల్లో ప్లేస్మార్ట్ జట్టు విజయం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : సత్యా గ్లోబల్‌సిటీ మైదానంలో అర్జున్‌కప్ కోసం జరుగుతున్న క్రికెట్ పోటీలో ప్లేస్మార్ట్ జట్టు రెండు వికెట్లతో ప్యాంథర్స్ జట్టుపై గెలుపొందింది. మంగళవారం జరిగిన ఈ పోటీలో మొదట బ్యాటింగ్ చేసిన ప్యాంథర్స్ జట్టు నిర్ణిత 30 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 162 పరుగులు చేసింది. ప్లేస్మార్ట్ జట్టు 29.1 ఓవర్లలో 164 పరుగులు చేసి విజయం దక్కించుకొంది. మరో పోటీలో గోపాలన్ స్పోర్ట్స్ జట్టు తొమ్మిది వికెట్లతో ఆర్‌కేట జట్టుపై విజయం సాధించింది. ఆర్‌కే జట్టు 23 ఓవర్లలో 72 పరుగులకు ఆలౌట్ కాగా గోపాలన్ జట్టు 10.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 73 పరుగులతో విజయం సాధించింది.

వ్యవసాయ, పారిశ్రామిక మేళా ప్రారంభం

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : రసాయనిక ఎరువుల వల్ల భూములు సారవంతాన్ని కోల్పోతున్నాయని, ప్రకృతిలో లభించే ఎరువులు, రైతులు సహజ కృషితో అధిక దిగుబడులు సాధించవచ్చునని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ ఆధ్యాత్మికమఠంలో శరణ సంస్కృతి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ, పారిశ్రామిక వస్తు ప్రదర్శన మేళాను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. 1960కు పూర్వం మన దేశంలో వ్యవసాయ రంగంలో రైతులు సాధారణ ఎరువులువాడేరన్నారు. ఆహార ధాన్యాల దిగుబడులను పెంచడానికి రసాయనిక ఎరువుల వాడకాన్ని మొదలు పెట్టారన్నారు. నేడు రైతులు సహజ కృషి విధానాలను పాటించడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో స్వామీజీలు సిద్ధలింగస్వామి, బసవకుమార స్వామి, బసవప్రభుస్వామి, శివయోగి కలసద, స్థానిక ఎమ్మెల్యే కేసీ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు. 50 ప్రదర్శన శాలలు ఏర్పాటు చేశారు. ప్రగతి పర రైతులను సత్కరించారు.

వజ్రముష్టి పోరుకు సిద్ధమైన ఫైల్వాన్ శ్రీనివాసజట్టి


పుట్టణ్ణతో శ్రీనివాసజట్టి ఫైల్వాను

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : మైసూరు దసరా ఉత్సవాల జంబూసవారి వేడుకల్లో ప్రజలను ఆకట్టుకొనే అత్యంత ప్రముఖమైన ముష్టికాళగ పోరుకు చామరాజనగర ఫైల్వాన్ శ్రీనివాసజట్టి సిద్ధమయ్యారు. విజయదశమి రోజున మైసూరు అంబావిలాస ప్రాంగణం కరికల్లు తొట్టి వేదికలో జరిగే వజ్రముష్టీ పోరుకు ఈయన రెండు నెలల నుంచి కసరత్తు చేస్తున్నారు. చామరాజనగర దొడ్డ గరడిలో తర్ఫీదుదారుడు పుట్టణజట్టి మార్గదర్శకంలో శిక్షణ పొందిన ఆయన రెండు సార్లు మైసూరు దసరా వజ్రముష్టికాళగా పాల్గొన్నారు. మహారాజుల కాలం నుంచి జరుగుతున్న ఈ పోటీలో చేతిలో దంతాన్ని పోలిన ఆయుధంతో ప్రత్యర్థి పై పోటీ చేసే సమయంలో ఎవరి తలపై అయినా రక్తం వస్తే పోటీ ముగిసినట్లే.


నాగభూషణం దంపతులను సత్కరిస్తున్న రమేశ్

నాగమారెమ్మ ఆలయంలో నవమి పూజలు

బెంగళూరు (మత్తికెరె), న్యూస్‌టుడే : కమ్మగుండనహళ్లిలోని నాగమారెమ్మ దేవాలయంలో శరవన్నవరాత్రుల పూజలు వైభవంగా జరుగుతున్నాయి. పూజల్లో మాజీ విద్యా సమితి అధ్యక్షుడు కె.నాగభూషణం దంపతులు పాల్గొన్నారు. వీరిని భాజపా మాజీ అధ్యక్షుడు రమేశ్ సత్కరించారు వేద పండితులు నాగమారెమ్మకు పూజలు చేయించి ఆశీర్వదించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

అమరాపురం, న్యూస్‌టుడే : శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలం బసవనపల్లి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా చిక్కతిమ్మనహట్టి గ్రామానికి చెందిన అంజనప్ప కుమారుడు తిప్పేస్వామి (48) అక్కడికక్కడే మృతి చెందాడు. మడకశిర నుంచి అమరాపురం వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న తిప్పేస్వామిని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు తగిలి అతను మృతి చెందాడు.

పేద విద్యార్థికి ఫీజు కట్టిన క్రికెటర్ రాహుల్


క్రికెటర్ రాహుల్

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : భారత క్రికెట్ జట్టు ఆటగాడు, మంగళూరుకు చెందిన కె.ఎల్. రాహుల్ పేద విద్యార్థికి కళాశాల ఫీజు చెల్లించి మానవత్వాన్ని చాటుకున్నారు. హుబ్లీలో బీకాం చదువుతున్న అమృత్ మావినకట్టి అనే విద్యార్థికి రెండో ఏడాది ఫీజు రూ.75 వేలు కట్టి అండగా నిలిచారు. తొలి ఏడాది ఫీజు కూడా రాహుల్ కట్టాడు. ఈ సందర్భంగా తనకు అండగా నిలిచి ఆర్థికంగా ఆదుకున్నారని, అతని ప్రోత్సాహంతో బాగా చదివి మంచి మార్కులు సాధిస్తానని విద్యార్థి హర్షం వ్యక్తం చేశాడు.

బెంగళూరు రోటరీ క్లబ్‌తో ఒప్పందాలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : కర్ణాటకలోని 100 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సౌర విద్యుత్తును వినియోగించుకునేందుకు కావలసిన సదుపాయాలను కల్పించేందుకు రోటరీ క్లబ్ ఆఫ్ బెంగళూరుతో సెల్కో ఫౌండేషన్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బెంగళూరుతో పాటు ఆరు జిల్లాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో ఇప్పటికే రోటరీ సంస్థ వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టింది. రోటరీ తరపున గౌరీ ఓజా, సెల్కో ఫౌండేషన్ తరపున జోబీ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

‘తుమకూరు దసరా ఉత్సవాల్లో పాల్గొనండి’

పావగడ, న్యూస్‌టుడే : మొదటి సారిగా తుమకూరులో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో తాలూకా నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తహసీల్దార్ డి.ఎన్.వరదరాజు పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా పాలనాధికారుల ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ నెల 11, 12వ తేదీల్లో జానపద, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు, ధార్మిక పూజలు ఉత్సవాల్లో చూపరులను కనువిందు చేయనున్నాయన్నారు. ఉత్సవాలకు తాలూకాలోని ప్రజలు అధిక సంఖ్యలో తరలివెళ్లి ఉత్సవాల్లో పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా దసరా ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఈఓ జానకిరామ్, పురసభ అధ్యక్షుడు జాఫర్ షరీఫ్, సిఐ ఎం.ఆర్.సురేశ్, వ్యవసాయ శాఖాధికారి అజయ్‌కుమార్, ఆర్ఐ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ప్రదర్శిస్తున్న అధికారులు

ఎంబీఏ, ఎంసీఏ తరగతుల ప్రారంభం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : పీఈఎస్ విశ్వవిద్యాలయంలో మొదటి ఏడాది ఎంబీఏ, ఎంసీఏ తరగతులను కళాశాల పూర్వ విద్యార్థి ఐ.నితిన్ చిత్రాంశ్‌తో కలిసి ఆచార్య జవహర్ దొరెస్వామి ప్రారంభించారు. ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, స్కాలర్‌షిప్ పత్రాలను అందజేశారు. వృత్తి జీవితంలో రాణించేందుకు విద్యార్థి దశ నుంచే దృఢమైన పునాది వేసుకోవాలని ఆచార్య జవహర్ తెలిపారు. వర్సిటీ ప్రతినిధులు డాక్టర్ కేఎస్ శ్రీధర్, డాక్టర్ జే సూర్యప్రసాద్, ఆచార్య అజోయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఆచార్యులు

రోడ్డు ప్రమాదంలో మహిళా ఉద్యోగి దుర్మరణం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : సంచరిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడటంతో రహదారిపై వస్తున్న కారు ఉళ్లాళ ఉపనగర నివాసి ఉద్యోగి మోనికా (28)పై వెళ్లడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం ఇక్కడ జ్ఞాన భారతి సంచార పోలీసుఠాణా పరిధిలో జరిగింది. ఉదయం 9.50గంటల సమయంలో విధులకు వెళుతుండగా ఉళ్లాళ చెరువు వద్ద 80 అడుగుల రహదారిలో ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

ఐదుగురు నిందితుల అరెస్టు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : నగరంలోని వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారనే ఆరోపణపై ఐదుగురు నిందితులను నగర పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.55 లక్షల విలువ చేసే 55 ల్యాప్‌టాప్‌లు, 28 చరవాణులు, తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు కమిషనర్ దయానంద్ తెలిపారు. జయనగర, జేపీనగర, కుమారస్వామి లేఔట్, గిరినగర, బన్నేరుఘట్ట తదితర పోలీసుఠాణాల్లో నిందితులు దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు..

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : నగరంలోని వివిధ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నారనే ఆరోపణపై తమిళనాడుకు చెందిన మురుగన్, వేలును హెచ్ఎస్ఆర్ లేఔట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.13 లక్షల విలువ చేసే 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో ముగ్గురు..

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : మద్యం తాగి మెట్రో రైల్లో సంచరించేందుకు ప్రయత్నాలను అడ్డుకున్న కాపలదారుడిపై దాడికి పాల్పడిన నిందితులు మహ్మద్ ఐడ్రీస్, శ్రీశైల, మడివాళప్పలను కాడుగోడి పోలీసులు అరెస్టు చేశారు. కాడుగోడి ట్రీ పార్క్ మెట్రోస్టేషన్‌లో ఆదివారం సాయంత్రం 7గంటలకు ఈ సంఘటన జరిగింది. మద్యం సేవించిన నిందితులు స్టేషన్‌లోపలకు వచ్చారు. నిందితులు ప్లాట్‌ఫారంపైకి వెళ్లకుండా కాపలదారుడు అడ్డుకున్నారు. దీంతో నిందితులు అతడిపై దాడి చేసి పరారయ్యారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా నిందితులను అరెస్టు చేశారు.



బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు


సిద్దు మా బాస్ : డీకే



శివకుమార్

హుబ్బళ్ళి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్దరామయ్య కిందే తాను పని చేస్తున్నానని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి మార్పునకు సంబంధించి పార్టీలో ఇప్పటి వరకు ఎటువంటి చర్చ జరగలేదన్నారు. సిద్దరామయ్య నేతృత్వంలోనే మూడు నియోజకవర్గాల్లో జరిగే ఉప ఎన్నికల్లో అభ్యర్థులను నిలుపుతామని చెప్పారు. హరియాణాలో పార్టీ ఓటమికి సంబంధించి సీనియరు నేతలు హస్తినలో చర్చిస్తారని తెలిపారు.

సర్కారును కూల్చేందుకు కుట్ర



శివరాజ్ తంగడగి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ప్రభుత్వాన్ని కూలగొట్టేందుకు భాజపా నాయకులు రూ.వెయ్యి కోట్లు కూడగట్టారని రాష్ట్ర మంత్రి శివరాజ్ తంగడగి ఆరోపించారు. భాజపా ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ చేసిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర, హావేరి ఎంపీ బసవరాజ బొమ్మై నివాసాల్లో సోదాలు చేయించాలని డిమాండు చేశారు. తనకు ప్రభుత్వం కేటాయించిన 14 సైట్ల విలువ రూ.62 కోట్లు ఉంటుందని సిద్దరామయ్య చెప్పిన వెంటనే ఈడీ అధికారులు దర్యాప్తునకు ఎందుకు ముందుకు వచ్చారన్నట్లని ప్రశ్నించారు. ఈడీ తన దర్యాప్తును భాజపా నాయకులతో ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ఉద్యాననగరి వైభవం



విగ్రహాలకే సిద్ధంగా ఉన్న దుర్గామాత ప్రతిమలు



ఓ నివాసంలో ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బెంగళూరులోనూ దసరా వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. బెంగళూరి సంపూల ప్రతినిధులు తమ నివాసాలు, అపార్ట్‌మెంట్ సముదాయాల్లో దుర్గామాత విగ్రహాలను ఏర్పాటుచేసి, విజయదశమి నాడు పూజలు చేసేందుకు సిద్ధమయ్యారు. కొన్ని సంపూల ప్రతినిధులు భారీ విగ్రహాలను తయారు చేయించుకున్నారు. విజయదశమి నుంచి వారం పాటు విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు పలుచోట్ల, స్యాంకీ చెరువుల్లో ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. చిక్కపేట ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్, మేదిని గరుడాచార్ తమ నివాసంలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంటోంది. కొన్నేళ్లుగా తాము సేకరించిన బొమ్మలను ఈ కొలువులో ఉంచుతూ, పూజలు చేసుకుంటున్నామని మేదిని గర్వ చేశారు. పాఠశాలలకు సెలవు ఇవ్వడంతో తమ పిల్లలతో కలిసి సొంత ఊళ్లకు ఎక్కువ మంది తరలి వెళ్లారు. గురువారం నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు కేఎస్ఆర్టీసీ, ఏపీ ఎస్ఆర్టీసీ బెంగళూరు నుంచి అదనపు బస్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి.

పాహిమాం.. పరాశక్తి



లక్ష్మీపూజ అందుకున్న భ్రమరాంభ



ముత్యాలమ్మకు ఆకులు, నిమ్మకాయల అలంకరణ



మాన్వి: స్కందా మాత దుర్గ అలంకరణలో అమ్మవారు

రాయచూరు, న్యూస్‌టుడే: నగరంలో శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఆచరిస్తున్నారు. ఆలయాల ప్రాంగణాలు జగదాంబ నామస్మరణతో హోరెత్తాయి. ఉత్సవాల ముగింపు దశకు చేరుకుంటున్న నేపథ్యంలో ఆరో రోజైన మంగళవారం భక్తుల రద్దీ అధికమైంది. సాక్షాత్కరించిన అమ్మవారి దివ్య రూపాన్ని కనులారా తిలకించి భక్తులు పరవశులయ్యారు. పాహిమాం.. పరాశక్తి అంటూ ప్రార్థిస్తున్నారు. ఉప్పారవాడి లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 14 భువన భాండాలకు అధిపతి మహా విష్ణువు సోమవారం రాత్రి చంద్రవాహనంపై ఆసీనుడై పురవీధుల్లో తిరిగారు. లోకాలను పాలించే నారాయణుడికి ప్రజలు సాదర స్వాగతం పలికారు. గద్వాల్ రహదారిలోని లక్ష్మీదేవి, కాళికాదేవి ఆలయాలు ఉత్సవాల శోభతో కళకళలాడుతున్నాయి. రాత్రి వేళ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు మనోరంజకంగా ఉంటున్నాయి. మున్నూరు కాపు సమాజం ప్రముఖులు పాల్గొన్నారు. నిజలింగప్ప కాలనీ మిలీనియం ఉద్యానవనంలోని భ్రమారాంభను దివ్యంగా అలంకరించి లక్ష్మీదేవి పూజ చేశారు. గూడ్స్‌షెడ్ ప్రాంతంలో కొలువైన గ్రామ దేవత ముత్యాలమ్మకు నిమ్మకాయలు, తమలపాకులతో చేసిన అలంకరణ విశేషంగా ఆకట్టుకుంటోంది. మధ్యాహ్నం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు.

సామూహిక కుంకుమార్చన పూజ

మాన్వి: సిరివార తాలూకా నీలగల్ క్యాంపులో దసరా శరన్నవరాత్రి సందర్భంగా సామూహిక కుంకుమార్చన పూజ ఘనంగా జరిగింది. మంగళవారం జి.వి.వి.సత్యనారాయణ శర్మ, రవికిరణ్‌శర్మల సాన్నిధ్యంలో స్థానిక రామాలయంలో మహిళలు అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. క్యాంపునకు చెందిన మహిళలు సామూహికంగా కుంకుమపూజ చేశారు. అమ్మవారికి లక్ష్మీదేవి అలంకరణ చేశారు. మాన్వి పట్టణంలోని వాసవీ కల్యాణ మంటపంలో స్కందా మాత దుర్గ అలంకరణ నిర్వహించారు. ఆర్యవైశ్య పండితుల ఆధ్వర్యంలో సామూహిక హోమపూజలు చేశారు. సంఘం అధ్యక్షుడు ఆర్.ముత్తురాజ్ శెట్టి, శివశంకర్‌శెట్టి, వాసవీ మహిళా మండళి, వాసవీ యువక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా మారికాంబాదేవి ఉత్సవం

మాన్వి: రాయచూరు గ్రామీణ పరిధిలోని మమదాపూర్‌లో మారికాంబాదేవి ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో వివిధ ధార్మిక కార్యక్రమాలు, సాధకులకు సన్మానం జరిగింది. దేవస్థానం సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవంలో రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పక్షి ప్రేమికుడు సల్లాఉద్దీన్, వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన ప్రముఖులను సత్కరించారు.



చంద్రవాహనం సేవలో భక్తులు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



మాన్వి: సాధకులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఆందోళన



రద్దు చేయాలంటూ నినాదాలు

రాయచూరు, న్యూస్‌టుడే : కన్నడ మాధ్యమాన్ని ఎత్తివేసిన రాయచూరు తాలూకా శక్తినగర్‌లోని దయానంద ఆంగ్ల వేదిక పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని 'జిల్లా కన్నడ క్రియా సమితి' జిల్లా యంత్రాంగాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రతినిధులు మంగళవారం ఇక్కడి టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో ధర్నాకు దిగారు. సంబంధిత అధికారికి వినతి పత్రం అందజేశారు. ఏపీజీ ఏసీకు చెందిన ఈ పాఠశాలను 2009-10లో ఆంగ్ల వేదిక ప్రైవేట్ పాఠశాలకు అప్పగించారని, ఆ సమయంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు ఆంగ్లం, కన్నడ మాధ్యమాలు ఉండేవన్నారు. 2013-14 నుంచి ఏటా ఒక్కో తరగతిలో కన్నడ మాధ్యమాన్ని తొలగించారని ఫిర్యాదు చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి కన్నడ మాధ్యమం ఆఖరిదని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా సరిహద్దు గ్రామాల విద్యార్థులు కన్నడలో చదివే అవకాశాన్ని కోల్పోతారన్నారు. రాష్ట్ర భాషలో బోధనపై ఆసక్తి లేని సదరు పాఠశాల గుర్తింపు రద్దుచేయాలని పట్టుబట్టారు. కన్నడలో అభ్యసించాలన్న విద్యార్థులకు ప్రత్యామ్నాయ వ్యవస్థను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు రఫీక్ అహ్మద్, ఉపాధ్యక్షుడు రామణ్ణ మ్యాదర్, సభ్యులు రామలింగప్ప కుణి, సిద్రామప పాటిల్, వెంకయ్య, బషీర్ అహ్మద్ హొసమని, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

'అక్రమాలపై విచారణ చేయాలి'



వినతి పత్రం అందిస్తున్న ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు తాలూకా మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధి గిల్లేసూగూరులోని శిశు యోజనాభివృద్ధి కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై దర్యాప్తు జరిపించాలని 'కర్ణాటక రైతు సంఘం, హసిరు సేన' జిల్లా పాలనాధికారి నితీష్‌కు మనవి చేసింది. జిల్లా కార్యాధ్యక్షుడు మంజునాథ్ నాయకత్వంలో ప్రతినిధులు మంగళవారం అధికారికి వినతి పత్రం ఇచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తలను అర్హులను కాకుండా అనర్హులను నియమించుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. చిక్కసూగూరు అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో ఉద్యోగంలో చేరిన ఒక కార్యకర్త లక్షలాది రూపాయలు ఉపముఖ్యమంత్రి కూడా జెట్టారని ఆరోపించారు. ఆ వివరాలను అధికారులకు అందజేసినా చర్య తీసుకోకపోవడానికి కారణం ఏమిటో అంతుచిక్కలేదన్నారు. జిల్లాలో ఏడు తాలూకాల్లోని శిశు యోజనాభివృద్ధి కార్యాలయాల్లో అవినీతి పరాకాష్ఠకు చేరుకుందన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. వీటిపై కూడా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

'అధిష్ఠానానికి అప్ప బెదిరింపులు'



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దినేశ్‌గుండూరావు తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : మహిళలకు లైంగిక వేధింపులకు గురిచేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ముఖ్యమంత్రి బి.ఎస్.యడియూరప్పకు వ్యతిరేకంగా భాజపా అధిష్ఠానం ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్‌గుండూరావు ప్రశ్నించారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న నృత్యదర్శకుడు జానీకి ప్రకటించిన పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవడాన్ని వెనక్కి తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. దినేశ్ మంగళవారం ఇక్కడ కాంగ్రెస్‌భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న యడియూరప్ప నేటికీ భాజపా కేంద్ర విభాగ పదవుల్లో కొనసాగుతున్నారని, ఆయనను తొలగించడం సాధ్యం కాదా? అని ప్రశ్నించారు. కేసులో సాక్ష్యాధారాలను నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర అధిష్ఠానాన్ని బెదిరింపులకు దిగడంతో హస్తిన నాయకులు ఏమీ చేయలేక పోతున్నారని ఎద్దేవా చేశారు.

సేవాభావం పెంపొందించే ఎన్ఎస్ఎస్



శ్రమదానంలో పాల్గొన్న విద్యార్థులు

రాయచూరు, న్యూస్‌టుడే : సేవాభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందించే ఎన్ఎస్ఎస్‌లో విద్యార్థులు చేరాలని రాయచూరు విశ్వవిద్యాలయం మూల్యాంకనం రిజిస్ట్రార్ ఆచార్య ఎర్రిస్వామి కోరారు. ఈ ఉద్దేశంతోనే ప్రభుత్వం ప్రతి పాఠశాల, కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం నెలకొల్పడాన్ని తప్పని సరి చేసిందని తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలోని కృష్ణతుంగా ఆవరణలో మంగళవారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఎర్రిస్వామి మాట్లాడుతూ స్వచ్ఛత, పచ్చదనం ప్రయోజనాల గురించి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. ఆరోగ్య సంరక్షణకు ఇళ్లు, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడం, పర్యావరణ పరిరక్షణకు మొక్కలను పోషించడం, ప్లాస్టిక్ వస్తువులను త్యజించేలా అవగాహన కల్పించాలన్నారు. కేవలం పరిశుభ్రతా కార్యక్రమాలకు పరిమితం కాకుండా, గ్రామాలు, పట్టణాల్లోని పేదల బస్తీల్లో తరచూ ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. దేశసేవకు మించిన సేవ లేదన్న భావనతో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సహ అధ్యాపకులు వెంకటేష్, లతా, డాక్టర్ మంజునాథ్, విద్యార్థుల సంక్షేమ, కార్యక్రమాల అధికారి డాక్టర్ జి.ఎస్.బిరాదార్, నాగవేణి, విజయసరోదా, శివరాజ్ హరవి పాల్గొన్నారు.

వసతి నిలయాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

రాయచూరు, న్యూస్‌టుడే : వృత్తిపర, స్నాతకోత్తర కోర్సులు అభ్యసిస్తున్న వెనుకబడిన వర్గాల విద్యార్థులు రాయచూరు తాలూకాలోని మెట్రిక్ తర్వాత బాలుర, బాలికల వసతి నిలయాల్లో ప్రవేశం పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. అక్టోబరు 30 లోపు https:///shp.karnataka.gov.in/bcwd వెబ్‌సైట్‌కు పంపుకోవాలని బీసీ సంక్షేమశాఖ అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. పూర్తి వివరాల కోసం https:///bcwd.karnataka.gov.in చూడాలని కోరారు. దరఖాస్తు వేళ సాంకేతిక సమస్యలు తలెత్తితే జిల్లా, తాలూకా కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు.

నవలిపై తెలుగు రాష్ట్రాల సీఎంలతో చర్చిస్తాం

ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడి



సింధనూరు ఏపీఎంసీలో రైతు దసరా ఉత్సావాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్

సింధనూరు, న్యూస్‌టుడే: దసరా హడావిడి ముగిసిన వెంటనే నెల రోజులలోగా నవలి జలాశయం నిర్మాణం అనుమతి కోసం ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రుల సమావేశం ఏర్పాటు చేసి అంతిమంగా ఈ విషయాన్ని తేల్చేస్తాం..ఇక నాన్చుడు ఉండదు, తెలుగు రాష్ట్రాల సీఎంలను కర్ణాటకకు ఆహ్వానించడం లేదా మేమే అక్కడకు వెళ్లి కలవడమో ఏదోటి జరుగుతుంది..మొత్తానికి నెలలో నవలిపై ఓ నిర్ణయం తీసుకుంటామని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ రాయచూరు, బళ్లారి, కొప్పళ జిల్లాల ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు. సింధనూరులో జరుగుతున్న నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన 'సింధనూరు రైతు దసరా' వేడుకను ప్రారంభించి డీకేశి మాట్లాడారు. తొలుత స్థానిక ఎమ్మెల్యే బాదర్లి మాట్లాడుతూ..తుంగభద్రలో వృథాగా పోతున్న జలాలు, పూడిక, నవలి జలాశయం ఆవశ్యకతల గురించి మాట్లాడారు. అనంతరం వేదికపై ఉన్న మూడు జిల్లాల ఎమ్మెల్యేలు, ఇతర పార్టీల నాయకులు ఇదే విషయంపై డీకేశికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఉప ముఖ్యమంత్రి స్పందించి మాట్లాడారు. తుంగభద్ర జలాశయాన్ని కాపాడుకోవడంలో మా ప్రభుత్వం కట్టుబడి ఉందని గుర్తు చేశారు. ఇటీవల 19వ క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయినప్పుడు నిండుకుండలా ఉన్న తుంగభద్ర జలాశయం నీటిని ఎలా కాపాడుకుంటారో అని యావత్ దేశం ఆసక్తిగా ఎదురుచూసింది. ఆరు రోజుల్లో పనులు ముగించి అందరూ అవాక్కయ్యేలా చేశాం..ఈ విషయంలో సీనియర్ ఇంజినీర్ కన్నయ్యనాయుడి సాహసం మెచ్చుకోదగ్గదని కొనియాడారు. అందుకే ఈనాడు దసరాను మీరంతా ఆనందంగా ఆచరించగలుగుతున్నారని రైతులతో అన్నారు. మిగిలిన అన్ని గేట్లను సరిచేయించి తుంగభద్రను రక్షించుకుంటామని చెప్పారు. చక్కని సంకల్పం ఉంటే ఏదైనా విజయవంతమవుతుందని అన్నారు. ఇకపై ఏటా ఇదేవిధంగా సింధనూరు దసరాను వైభవంగా ఆచరించాలని కోరారు. తొలుత ఆయన గాంధీకూడలిలో రైతుల ఎడ్లబండి ఊరేగింపును ప్రారంభించారు. ఆపై ఏపీఎంసీలో రైతుమేళా వ్యవసాయ వస్తు ప్రదర్శన ప్రారంభించారు. ఏపీఎంసీ యార్డు అంతా రైతుల వివిధ కార్యక్రమాలతో సందడిగా మారింది. కార్యక్రమంలో వ్యవసాయ మంత్రి చలువరాయ స్వామి, కొప్పళ జిల్లా బాధ్య మంత్రి తంగడిగి, ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి మాట్లాడారు. కాంగ్రెస్ నేత సలీం అహ్మద్, ఎమ్మెల్యేలు దద్దల్, ఆర్.బసనగౌడ, రాఘవేంద్ర హిట్నాళ్, బీఎం.నాగరాజ్, ఎమ్మెల్సీ బయ్యాపూరు, ఉత్సవ సమితి నాయకులు కేవీ, నాడగౌడ పాల్గొన్నారు.



రైతులను రంజింపజేస్తున్న కళాకారులు

దర్శన్‌కు దక్కని ఊరట

బెంగళూరు (సదాశివనగర) : చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో నిందితులు దర్శన్, పవిత్రాగౌడ బెయిలు కోసం వేసుకున్న అర్జీ విచారణ బుధవారానికి వాయిదా పడింది. నిందితులకు బెయిలు ఇవ్వకూడదంటూ ప్రభుత్వ న్యాయవాది ప్రసన్నకుమార్ సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. ఫిబ్రవరి నుంచే రేణుకాస్వామి తనకు సందేశాలు పంపిస్తూ ఉంటే.. దానిపై పోలీసులకు ఫిర్యాదు చేయకుండా పవిత్రాగౌడ తన వాట్సప్ నంబరు ఇచ్చిందన్నారు. అనంతరమే అతను అశ్లీల చిత్రాలను పంపించాడని తెలిపారు. నంబరు బ్లాక్ చేసుకునేందుకు లేదా.. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉన్నప్పటికీ దాన్ని వినియోగించుకోలేదన్నారు. రేణుకాస్వామి ఛాతీపై కొట్టడంతోనే ఎముకలు విరిగి చనిపోయాడని ఫోరెన్సిక్ ప్రయోగశాల నివేదికను న్యాయమూర్తి దృష్టికి ఆయన తీసుకువెళ్లారు.

అక్టోబరు రేషన్ విడుదల

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లాకు అక్టోబరు రేషన్ కోటా విడుదల చేసినట్లు ఆహార పౌర సరఫరా శాఖల ఉప నిర్దేశకుడు కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఆహార భద్రత చట్టంలో అంత్యోదయ కార్డు కల్గిన కుటుంబానికి 21 కిలోల బియ్యం, 14 కిలోల జొన్నలు, బీపీఎల్ కుటుంబంలో ఒక్కో సభ్యుడికి మూడు కిలోల బియ్యం, రెండు కిలోల జొన్నలను ఉచితంగా పంపిణీ చేస్తారని వివరించారు. ఏపీఎల్ కార్డులో ఒకే వ్యక్తి ఉంటే 5 కిలోల బియ్యాన్ని కిలో రూ.15కి, ఇద్దరు అంత కంటే ఎక్కువగా ఉంటే 10 కిలోల బియ్యాన్ని విక్రయిస్తారు.

28న ఉద్యోగుల సంఘం ఎన్నికలు

సిరివార, (మాన్వి) : ఈ నెల 28న స్థానిక ప్రభుత్వ బాలుర ప్రాథమికోన్నత పాఠశాలలో ఉద్యోగుల సంఘానికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ప్రదీప్‌గౌడ నందరెడ్డి తెలిపారు. ఈ నెల 9 నుంచి 18 వరకు నామినేషన్లు అందించవచ్చు. 28న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

08-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1632.00	1616.28
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	11,954	2235
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	11,654	9,536
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.773	51.519

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

ఆ ఊరు.. ఊపిరి పీల్చుకుంటోంది!

అర్ధరాత్రి దాటిందంటే.. ఆ ఊరి శివార్లలో ఒకటే ఏడ్పులు.. పెడబొబ్బలు.. మృత్యునాదాలు. నెత్తుటి చారికలు ఆరకనే పారే కొత్త రుధిరధారలతో ఆ ప్రాంతం భయాందోళనలుకు నెలవు. మోగే మరణమృదంగాలతో నిత్యం మృత్యుదేవత తారాడే ప్రాంతానికి కంటిమీద కునుకే కరవయ్యేది. నేడు.. ఆ పరిస్థితులు మారిపోయాయి. ఆ ఊరు నెమ్మదించింది.

దావణగెరె, న్యూస్‌టుడే : దావణగెరె సమీపంలోని ఆనెగోడు అంటే ప్రమాదాలకు పెట్టింది పేరు. బెంగళూరు నుంచి హుబ్బళ్లి- ధార్వాడ, బెళగావి, పుణె, మహారాష్ట్రను అనుసంధానం చేసే ఏకైక జాతీయ రహదారి ఇదే. ఆనెగోడు గ్రామంలో ఒకప్పుడు సింగిల్ రోడ్డు మాత్రమే ఉండేది. ప్రముఖ నటుడు శంకర్‌నాగ్ తొమ్మిదో దశకంలో తన చిన్నవయసులోనే ఈ ప్రాంతంలో సంభవించిన ప్రమాదంలో మరణించారు. ఈ రహదారిపై సంభవించిన ప్రమాదాల్లో ఎక్కువ ఇక్కడే జరిగేవి. వాటిని తగ్గించేందుకు దీన్ని డబల్ రోడ్డుగా అనంతరం నాలుగు వరుసల మార్గంగా అభివద్ధి చేశారు. ప్రస్తుతం వంతెన నిర్మాణంతో పాటు ఆనెగోడు వద్ద ఆరు వరుసల మార్గాన్ని విస్తరించారు. నిర్మాణం పూర్తయ్యాక ఇక్కడ సంభవిస్తున్న ప్రమాదాల సంఖ్య 80 శాతం తగ్గిపోయాయి. గతంలో మార్గానికి ఇరువైపులా భారీ వృక్షాలు ఉండడం, వాహనాల దీపకాంతి తక్కువ కావడంతో ఇబ్బందులు ఎదురయ్యేవి. బెంగళూరు, పుణెల నుంచి వచ్చే వాహనదారులు ఎనిమిది గంటల ప్రయాణం చేసి ఇక్కడకు చేరుకునే సరికి అర్ధరాత్రి దాటి ఉండడంతో నిద్ర మత్తులో ప్రమాదాల బారిన పడేవారని స్థానికుడు బసవరాజ్ తెలిపారు. అప్పట్లో నెలకు సగటున 15 వరకు ప్రమాదాలు సంభవించేవని వివరించారు. ప్రమాదం సంభవించిన ప్రతిసారీ గ్రామస్థులే స్పందించి, అంబులెన్సును పిలిపించడం, వాహనాల్లో చిక్కుకున్న వారిని రక్షించేవారిమని గతాన్ని గుర్తు చేసుకున్నారు. ఇపుడా ఇక్కట్లు పూర్తిగా నిలువరించడంతో ఊరంతా ఊపిరి పీల్చుకుంటోందన్నారు.



చిత్రదుర్గకు ఇక్కడి నుంచి 51 కి.మీ. దూరమే



దారి మధ్యలో.. గ్రామం వద్ద నిర్మించిన వంతెన

మారెమ్మ దేవస్థానం సమితి అధ్యక్షుడిగా నరసణ్ణ



నరసణ్ణను సన్మానించిన దృశ్యం

రాయచూరు, న్యూస్‌టుడే: బాల మారెమ్మ దేవస్థానం (తిమ్మాపూరపేట) సమితి అధ్యక్షుడిగా కె.టి.నరసణ్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేవస్థానం ఆవరణలో జరిగిన సమావేశంలో సమితి ప్రతినిధులంతా ఇతడి పేరును ప్రతిపాదించారు. దీంతో పోటీ లేకుండా గెలిచినట్లు నిర్వాహకులు ప్రకటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కె.శాంతప్ప మాట్లాడుతూ ధార్మిక విధి విధానాలను అనుసరించాలని, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. సేవా కార్యకలాపాలను విస్తరించాలని సమితికి సలహా ఇచ్చారు. ఈ సందర్భంగా పేట ప్రముఖులు తిమ్మప్ప నాడగౌడ, పూజారి శరణప్ప, మాస్టర్ మల్లయ్య, రమేష్, వడ్డి హనుమంతు, కడుగోలు గోపి తదితరులు నరసణ్ణకు సన్మానించారు.

ముస్లింల భారీ నిరసన ప్రదర్శన



నిరసన ప్రదర్శనలో ముస్లింలు

మాన్వి: ఉత్తరప్రదేశ్‌లోని గజియాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో నరసింహ సరస్వతి అనే ధార్మిక ప్రముఖుడు మహమ్మద్ ప్రవక్తను నీచ పదాలతో హేళన చేయడాన్ని నిరసిస్తూ స్థానిక ముస్లింలు పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన చేశారు. సముదాయాన్ని కించపర్చే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ముస్లిం మత పెద్ద సయ్యద్ జజ్జాద్ హుసేని మత్వాలే డిమాండ్ చేశారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలతో సమాజంలో అశాంతి నెలకొంటుందన్నారు. టిప్పుసుల్తాన్ కూడలి నుంచి ఐబీ, అంబేడ్కర్ కూడలి, బసవ కూడలి మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వినతి పత్రాన్ని తహసీల్దార్ రాజు ఫిరంగికి అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ముఫ్తీ హసన్ జిశాన్ ఖాద్రి, అక్బర్‌పాషా, సాధిక్‌పాషా, ఖాలిద్ ఖాద్రిగురు, సయ్యద్ హుసేన్, నజరుద్దీన్‌ఖాద్రి, సిరాజుద్దీన్‌ఖాద్రి, శేక్‌ఫరీద్ ఉమ్రి పాల్గొన్నారు.